జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528



రంగారెడ్డి మంగళవారం 17 ఫిబ్రవరి 2026 సంపుటి : 1 సంచిక : 49 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from . RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




## తొలి బోర్డు పరీక్షలకు హాజరు తప్పనిసరి

- టెన్త్ వార్షిక పరీక్షలపై సీబీఎస్ఈ
- కనీసం మూడు సబ్జెక్టులైనా రాయాలి
- లేదంటే రెండో బోర్డు పరీక్షలకు అనర్హులు
- వారు వచ్చే సంవత్సరంలో రాయాల్సిందే

3



## నేడు ముంబైలో మోదీ, మేక్రాన్ భేటీ

- భారత్‌ఫ్రాన్స్ పరస్పర వ్యూహాత్మక బంధంపై సమీక్ష
- వ్యూహాత్మక బంధం బలోపేతం చేయడంతోపాటు నూతన, కొత్తగా ఉద్భవిస్తున్న రంగాల్లోనూ సహకారాన్ని విస్తృత పర్చుకోవడంపై ఇరునేతలు ప్రధానంగా దృష్టి

3


# హంగ్‌లో కింగులైన స్వతంత్రులు



- ఆదిలాబాద్, భైంసా, జమ్మికుంటలో అనూహ్య పరిణామాల నడుమ చైర్మన్లుగా ఎన్నిక
- చైర్మన్లుగా ఎన్నికయ్యాక.. ఆ ముగ్గురిలో ఒకరు కాంగ్రెస్‌లో చేరగా, మరొకరు బీఆర్ఎస్‌లో చేరడం గమనార్హం
- భైంసాలో కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్..

**ఆదిలాబాద్**

తాజా పురపోరులో ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో మూడు మునిసిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం దక్కకపోవడంతో.. స్వతంత్ర అభ్యర్థులే కింగులయ్యారు. చైర్మన్ పదవులను దక్కించుకున్నారు! అయితే, చైర్మన్లుగా ఎన్నికయ్యాక.. ఆ ముగ్గురిలో ఒకరు కాంగ్రెసలో చేరగా, మరొకరు బీఆర్ఎస్‌లో చేరడం గమనార్హం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎంఐఎం అత్యధిక స్థానాలు దక్కించుకున్న భైంసాలో.. కాంగ్రెసకు అత్యధిక స్థానాలు వచ్చిన ఆదిలాబాద్ మునిసిపాలిటిలో.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో స్వతంత్రులు చైర్మన్లుగా ఎన్నికయ్యారు. ఫలితాలు వెలువడిన నాటి నుంచి తీవ్ర ఉత్కంఠకు దారితీసిన - మిగతా2లో



## నాలుగు లైన్ల 'గ్రాండ్' కారిడార్

- విజయవాడ-కాజీపేట-బల్లార్షా మధ్య త్వరలో నాలుగో లైన్ నిర్మాణం
- దక్షిణఉత్తర భారత్‌లను జోడించే ప్రధాన రైల్వే లైన్‌కు మహర్దశ
- ప్రస్తుతం తుది దశలో మూడో లైన్ నిర్మాణ పనులు



## శబరిమల వివాదంపై విస్తృత ధర్మాసనం

- 9 మంది న్యాయమూర్తులతో ఏర్పాటు
- సీజేఐ సూర్యకాంత్ ధర్మాసనం నిర్ణయం
- ఏప్రిల్ 7 నుంచి 22 దాకా తుది విచారణ
- ముస్లిం, పార్శీ మహిళల సంబంధిత పిటిషన్లపైనా ధర్మాసనం విచారణ

# పురపాలికల్లో పైచేయి



- టార్గెట్ పెట్టుకుని మరీ మున్సిపాలిటీలు దక్కించుకున్న అధికార కాంగ్రెస్
- 81 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లతో పట్టణ స్థానిక సంస్థలపై పట్టు
- పెండింగ్ పడిన మున్సిపాలిటీలనూ దక్కించుకునేలా పావులు
- నిజామాబాద్ కార్పొరేషన్‌లో వ్యూహాత్మక వైఖరి... పట్టుపట్టి సాధించిన ఉత్తమ్, మహేశ్‌గౌడ్
- కొత్తగూడెం కార్పొరేషన్‌ను సీపీఐకి ఇవ్వడం ద్వారా ఆ పార్టీ భవిష్యత్ డిమాండ్లకు చెక్
- ఎక్కువ శాతం పుర పీఠాలు బీసీలకే ఇచ్చామంటున్న గాంధీ భవన్ వర్గాలు
- కరీంనగర్ కార్పొరేషన్‌లో వ్యూహాత్మక వైఫల్యంపై సమీక్ష

**హైదరాబాద్**

అనుకున్నట్టుగానే పురపాలక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ పైచేయి సాధించింది. మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్లలో డివిజన్లతోపాటు సింహభాగం మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ మేయర్లను తన ఖాతాలో వేసుకుంది. కనీసం 90 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ఎన్నికలకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీ.. వ్యూహాత్మకంగా వ్యవహరించి పట్టణ స్థానిక సంస్థల్లో పట్టు సాధించగలిగింది. సోమవారం జరిగిన మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ మేయర్ల ఎన్నిక ప్రక్రియలో భాగంగా 81 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లను ఆ పార్టీ కైవసం చేసుకుంది. వీటితోపాటు నలుగురు స్వతంత్రులు, ఒక ఏఐఎఫ్‌బీ అభ్యర్థి గెలుపొందిన స్థానాలు కూడా కాంగ్రెస్ మద్దతుతోనే వచ్చాయి. ఈక్రమంలో మరో 11 మున్సిపాలిటీలకు చైర్మన్లు, వైస్‌చైర్మన్ల ఎంపిక ప్రక్రియ మిగిలి ఉండగానే, 86 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగిరింది. ఇక, పెండింగ్ లో ఉన్న మున్సిపాలిటీల్లోనూ మెజార్టీ పీఠాలు తమవేననే ధీమా అధికార పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతుండటం గమనార్హం. పురపాలిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ మొదటి నుంచీ ఆచితూచి వ్యవహరించింది. అభ్యర్థుల ఎంపిక మొదలు, చైర్మన్ల ఎంపిక ప్రక్రియ ముగిసేంతవరకు పార్టీ నాయకత్వం సమన్వయంతో వ్యవహరించింది. ముఖ్యంగా అసెంబ్లీ నియోజకవర్గాల - మిగతా2లో



## ఘనంగా ప్రారంభమైన ఇండియా ఏఐ ఎక్స్‌పో!

- ప్రారంభించిన ప్రధాని మోదీ
- పారిశ్రామిక, ఏఐ ప్రముఖుల రాక
- ఏఐ ప్రభావంపై విస్తృత చర్చలు
- సమస్యల పరిష్కారాలపై దృష్టి
- ఐదు రోజుల పాటు ఎక్స్‌పో
- పాల్గొననున్న దేశాధినేతలు

# హంగ్‌లో కింగులైన స్వతంత్రులు

-మొదటిపేజీ తరువాయి

ఆదిలాబాద్ మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు ప్రశాంతంగా ముగిసింది. 21 స్థానాల్లో విజయం సాధించిన బీజేపీయే ఇక్కడ చైర్మన్ పీఠం దక్కించుకుంటుందని అంతా అంచనా వేశారు. కానీ.. అధికార కాంగ్రెస్ ఈ మునిసిపాలిటీపై దృష్టి సారించడంతో పరిస్థితులు తారుమరయ్యాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, స్వతంత్రుల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి బండారి అనూష చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా ఎంఐఎం అభ్యర్థి ఎండీ రోహిత్ ఎన్నికయ్యారు. స్వతంత్ర అభ్యర్థుల మద్ధతు కూడగట్టడంలో బీజేపీ విఫలమైంది. అయితే.. ఆదిలాబాద్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన అనూష.. సోమవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు.

**భైంసాలో కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్..**

ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్ వ్యూహాలతో.. భైంసా బల్దియాలో మజ్లిస్ ఆదిపత్యానికి బ్రేక్ పడింది. వరుసగా మూడోమారు ఆ మునిసిపాలిటీని కైవసం చేసుకోవాలనుకున్న ఎంఐఎం ఆశలు అడియాసలయ్యాయి. ఆ పార్టీని నిలువరించేందుకు అనూహ్యంగా బీజేపీ, కాంగ్రెస్ జత కట్టాయి. స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ఎంఐఎం కోటకు గండికొట్టాయి. ఇక్కడ 26 వార్డులకు ఎంఐఎం 12, బీజేపీ 6 స్థానాలను, కాంగ్రెస్ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. మిగతా వార్డులలో బీజేపీ రెబల్స్ స్వతంత్రులుగా 5 స్థానాలలో, మైనారిటీ వర్గానికి చెందిన ఇద్దరు మరో రెండుచోట్ల విజయం సాధించారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్ సారథ్యంలో వీరంతా జత కట్టారు. బీజేపీ రెబెల్‌గా బరిలోకి దిగిన 23వ వార్డు స్వతంత్ర అభ్యర్థి తూమొల్ల దత్తాత్రిని చైర్మన్‌గా, 25వ వార్డు స్వతంత్ర సభ్యురాలు బీబీ ఖతిజ సిద్దిఖీ వైస్ చైర్మన్‌గా బరిలోకి దింపి గెలిపించుకున్నారు.

**జమ్మికుంటలో తీవ్ర ఉద్రిక్తతల మధ్య..**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మునిసిపల్ చైర్మన్ పీఠం.. అనూహ్య మలుపులు, నాటకీయ పరిణామాల మధ్య అక్కడ 23వ వార్డు నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా







గెలుపొందిన మొలుగు ప్రశాంత్‌కుమార్(దిలీప్)కు దక్కింది. వైస్ చైర్మన్‌గా ముంతాజ్ అలీ మహమ్మద్ ఎన్నికయ్యారు. జమ్మికుంట మునిసిపాలిటీలో కాంగ్రెస్ 10 స్థానాలు గెలుచుకోగా.. బీఆర్ఎస్ 12, బీజేపీ 4 చోట్ల గెలుపొందాయి. స్వతంత్రులు ముగ్గురు, ఫార్వర్డ్ బ్లాక్ సభ్యుడొకరు గెలిచారు. ఎవరికీ స్పష్టమైన ఆధిక్యం రాకపోవడంతో.. ఫలితాలు వెలువడిన రోజు నుంచే క్యాంపు రాజకీయాలు మొదలయ్యాయు. తొలుత కాంగ్రెస్ క్యాంపులో ఉన్న ఇండిపెండెంట్లు మొలుగు ప్రశాంత్‌కుమార్, మరో ఇద్దరు, ఫార్వర్డ్ బ్లాక్ కౌన్సిలర్ కాంగ్రెస్ క్యాంపు నుంచి కరీంనగర్‌కు చేరుకున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శిబిరాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సోమవారం ఉదయం పదిన్నరకు ప్రశాంత్‌కుమార్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆరెస్ కౌన్సిలర్లతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవడంతో అందరూ అవాక్కయ్యారు. తమ క్యాంపులో ఉండి బీఆర్ఎస్ వైపు ఎలా వెళతారంటూ కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రశాంత్‌కుమార్, ఇతర సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కౌన్సిలర్లను వారి నుంచి విడిపించి తమవైపు తీసుకెళ్లారు. 12.30గంటలకు చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. బీఆర్ఎస్ నుంచి ఒకరు, కాంగ్రెస్ నుంచి ఒకరు చైర్మన్‌గా ప్రశాంత్‌ను ప్రతిపాదించారు. బీఆర్ఎస్ సభ్యులు 12మంది, ఇండిపెండెంట్లు ముగ్గురు, కాంగ్రెస్ 10 మంది..ఇలా మొత్తం 25మంది మద్దతుతో ప్రశాంత్‌కుమార్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా ముంతాజ్ మహమ్మద్ అలీని బీఆర్ఎస్ సభ్యులు 12మంది, ఇండిపెండెంట్లు ముగ్గురు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎక్స్‌అఫీషియో ఓటుతో 16మంది ఎన్నుకున్నారు. ప్రశాంత్ బీఆర్ఎస్ కండువా కప్పుకోవడంపై కాంగ్రెస్ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేయగా.. కండువా తీసి ప్రమాణం చేశారు. కానీ.. ఆ తర్వాత ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరడం గమనార్హం.

# 63 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

నగర పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న మరో 63 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కొత్వాల్ వీసీ సజ్జనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. లూప్‌లైన్లలో పని చేసిన, చేస్తున్న వారికి ప్రాధాన్యత కలిగిన పోస్టింగ్‌లు దక్కాయి. అలాగే వివిధ విభాగాల్లో ఎటాచ్‌మెంట్, వెయిటింగ్‌లో ఉన్న వారినీ వివిధ స్థానాల్లో నియమించారు. ఐదుగురిని కొత్తగా ఏర్పాటు చేసిన ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్ (ఐఎంసీ), యాంటీ ఫుడ్ అడాల్ట్రేషన్ టీమ్ (ఏఎఫ్ఏటీ) విభాగాల్లో నియమించారు.

అధికారి – పోస్టింగ్
టి.రాంబాబు – చార్మినార్
వి.రామకృష్ణ – చిలకలగూడ
బి.లక్ష్మీనారాయణ రెడ్డి – పహాడీషరీఫ్
ఆర్.రుక్మిణి – ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్
జి.రాజగోపాల్ రెడ్డి – ముషిరాబాద్
ఎన్.మోహన్‌రావు – అఫ్జల్‌గంజ్
ముజీబ్ ఉర్ రెహ్మాన్ – మీర్‌చౌక్
ఎస్.కోటేశ్వరరావు – ఛత్రినాక
కె.నర్సింహ్మా – డబీర్‌పుర
జి.నరేష్ – సుల్తాన్‌బజార్
ఎం.మహేష్ – ఉస్మానియా వర్సిటీ
కె.కరుణాకర్ – భవానీనగర్
ఎస్.సంతోషం – ఛత్రినాక ట్రాఫిక్
డి.అశోక్ – సనత్‌నగర్
ఇ.జంగయ్య – ఫలక్‌నుమా




ఎ.సీతయ్య – సైఫాబాద్
యు.శ్రీనివాసులు రెడ్డి – జూబ్లీహిల్స్
కె.మధులత – ఐఎంసీ
బి.ధనలక్ష్మి – ఐఎంసీ
బి.నర్సిములు – ఐఎంసీ
ఎ.పురేందర్‌రెడ్డి – ఐఎంసీ
ఎన్.రంజిత్ కుమార్ గౌడ్ – ఏఎఫ్ఏటీ

# పిండం గుండె.. గండం పెరుగుతుండె!

తల్లిగర్భంలో ఉండగానే పిండం గుండె లయ తప్పుతోంది. హార్ట్‌బీట్ రేటు గణనీయంగా తగ్గిపోతోంది. హైదరాబాద్‌లో ఇలాంటి కేసులు ఇటీవల బాగా పెరిగాయి. రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌కు నెలకు 300 కేసులు వస్తుండగా, అందులో సుమారు 30 వరకు ఫీటల్ హార్ట్ రేటు సమస్యలున్నాయి. గర్భం దాల్చిన 16 వారాల నుంచి 18 వారాల్లో ఎర్లీ టిఫా స్కాన్ చేసి పిండం పరిస్థితిని గుర్తించవచ్చని, సరైన సమయంలో స్పందించి చికిత్స అందిస్తే, పుట్టబోయే బిడ్డకు సాధారణ జీవితం అందించేందుకు వీలుంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**ఎందుకీ పరిస్థితి..?**

జొగ్రన్ సిండ్రోమ్, ఎస్ఎల్ఈ, యాంకలైజింగ్, స్పాండలైటిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్న గర్భిణుల్లోని పిండంపై హార్ట్‌బీట్ రేటుపై ప్రభావం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో పిండం గుండె తెల్లగా మారిపోతోంది. గుండె చుట్టూ నీరు చేరుతుంది. హార్ట్ వాల్వ్‌లు లీకవుతాయి. ఇటువంటి సమయంలో తల్లి నుంచి ప్లాసెంటా ద్వారా చికిత్స చేయడంలో ఎఫెక్ట్ ఆఫ్ ట్రీట్‌మెంట్ ఆశించిన మేరకు ఉండటంలేదు. దీంతో నేరుగా పీటస్‌కే ట్రీట్‌మెంట్ అందించే అత్యంత సంక్లిష్టమైన వైద్యసేవలను వైద్యులు విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. హైదరాబాద్‌కు




తెలంగాణలోని ఇతర జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఇతర సరిహద్దు రాష్ట్రాల నుంచి రిఫరల్ కేసులు వస్తున్నాయి.

**ప్రపంచంలోనే అత్యుత్తుమ సేవలు**

పిండం గుండెకు చికిత్సను ఇప్పటివరకు తల్లి నుంచే అందిస్తుండగా, తాజాగా నేరుగా ట్రీట్‌మెంట్ చేసే అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. పిండం హార్ట్ రేటు తక్కువగా ఉండటం, గుండె చుట్టూ నీరు చేరడం వంటి సందర్భాల్లో నేరుగా ఇమ్యునోగ్లోబిలిన్ థెరఫీ చేస్తున్నారు. దీనిలో 95 శాతం సక్సస్ రేటు ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇమ్యునోథెరపీ సేవలందించే ఆసుపత్రులు ప్రపంచంలోనే అతి తక్కువ సంఖ్యలో ఉన్నాయి. అందులో హైదరాబాద్‌కు స్థానం లభించడం గమనార్హం. అంతర్జాతీయంగా అత్యుత్తమ వైద్యసేవలకు హైదరాబాద్ కేంద్రంగా నిలుస్తోందనేందుకు ఇదొక ఉదాహరణ. అత్యాధునిక శస్త్రచికిత్సల్లో నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉండటంతో వివిధ దేశాల నుంచి శస్త్రచికిత్సల కోసం ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడి చికిత్సలపై ప్రఖ్యాత అమెరికన్ మ్యాగ్జైన్ జాక్ (జేఏసీసీ)లోనూ కథనాలు ప్రచురితం కావడం గర్వించదగ్గ విషయమని వైద్యునిపుణులు పేర్కొంటున్నారు.

**18వ వారం నుంచి ట్రీట్‌మెంట్**

నెలకు 300 కేసుల వరకు ఫీటల్ ఎకో చేస్తున్నాం. అందులో పది శాతం కేసుల్లో ఫీటల్ హార్ట్ రేట్ సమస్యలు ఉంటున్నాయి. గర్భం దాల్చిన 16 నుంచి 18 వారాల్లో ఎర్లీ టిఫా స్కాన్ చేయించుకోవడం మంచిది. గుండె సంబంధిత సమస్యలు ఉంటే గుర్తించి, త్వరితగతిన చికిత్స అందించే అవకాశం ఉంటుంది. అత్యవసర సమయంలో ఇమ్యునోథెరపీ చేస్తున్నాం. ప్రెగ్నెన్సీ నిర్ధారణ అయినా నిలవకపోవడం, అబార్షన్లు వంటి సమస్యలు ఉన్నపుడు ఎక్సటెండెడ్ ఏఎన్ఐ టెస్టు చేయించుకోవాలి. పిల్లల కోసం ప్లానింగ్ చేసుకునేటప్పుడే ట్రీట్‌మెంట్ తీసుకోవాలి.

## పురపాలికల్లో పై‘చేయి’

-మొదటిపేజీ తరువాయి

వారీగా ఎమ్మెల్యేలు, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా మంత్రులు బాధ్యతలు తీసుకుని ఎన్నికలను ఎదుర్కొన్నారు. వీరికి తోడు పీసీసీ నియమించిన సమన్వయకర్తలు, పరిశీలకులు, డీసీసీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నేతలు, కార్పొరేషన్ చైర్మన్లు ఎవరికి వారు పార్టీ అభ్యర్థుల గెలుపులో తమ వంతు పాత్ర పోషించారు. పీసీసీ ఏర్పాటు చేసిన వార్‌రూం కూడా ఎప్పటికప్పుడు పార్టీ శ్రేణులు, నాయకులను ఎన్నికల దిశలో నడిపించడంలో క్రియాశీలక పాత్ర పోషించింది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో వ్యూహాలు రచించారు. ప్రతి రోజూ ఎన్నికల సరళిని పర్యవేక్షించిన ఆయన మంత్రులకు దిశానిర్దేశం చేయడంతోపాటు ఎమ్మెల్యేలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించి, తగిన సూచనలు చేశారు. గత నెలలో తన విదేశీ పర్యటనకు ముందు, ఆ తర్వాత రెండు దఫాలుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రేవంత్ బీజేపీ, బీఆర్ఎస్‌లను నేరుగా తన మాటలతో ఢీ కొట్టడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగలిగారని రాజకీయ విశ్లేషకులంటున్నారు. మరోవైపు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా పార్టీ యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పురపాలిక ఎన్నికల్లో ఘన విజయం దిశగా ముందుకు నడిపించారు.

**మెదక్‌లోనే... ఓ మోస్తరు**

పోయిన దగ్గరే వెతుక్కోవాలనే నానుడి చందంగా.. మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్లలో కొంతమేరకు ప్రతికూల ఫలితాలు వచి?చన ప్రాంతాల్లో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆశించిన మేరకు ఫలితాలు రాని నేపథ్యంలో ఆయా జిల్లాల్లో మున్సిపాలిటీలను తమ ఖాతాలో వేసుకునే విషయంలో పకడ్బందీగా వ్యవహరించింది. దీంతో నల్లగొండ, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, పాలమూరు జిల్లాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను 90శాతానికి పైగా దక్కించుకోగా, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మంచి ఫలితాలు, మెదక్‌లో ఓ మోస్తరు ఫలితాలను సాధించగలిగింది. మరీ ముఖ్యంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పట్టుపట్టి మరీ అధికార పార్టీ చేజిక్కించుకుంది. పీసీసీ అధ్యక్షుడి సొంత స్థానం కావడంతో అక్కడ అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీని కాదని ఎంఐఎం సహకారంతో మేయర్ పీఠంపై కూర్చోగలిగింది. సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఈ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక, ఒక మెట్టు తగ్గి కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని మిత్రపక్షమైన సీపీఐకి ఇవ్వడంలోనూ తాము చాకచక్యంగా వ్యవహరించామ ని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. ఇక్కడ మేయర్ పీఠం సీపీఐకి ఇవ్వడం ద్వారా ఆ పార్టీ భవిష్యత్తులో చేసే రాజకీయ పదవుల డిమాండ్‌కు చెక్ పెట్టగలిగామని అంటున్నాయి. ఇక, పుర పీఠాలనూ ఎక్కువ శాతం బీసీ వర్గాలకు కేటాయించామని, ఆయా వర్గాలకు రిజర్వ్ చేసిన స్థానాలతోపాటు రిజర్వు చేయని మున్సిపాలిటీలను కూడా వెనుకబడిన వర్గాలకు కేటాయించామని చెబుతున్నాయి. తాము చెప్పిన విధంగా 50 శాతం కంటే ఎక్కువ బీసీలకు అవకాశం కలి?పంచామని కూడా పేర్కొంటున్నాయి. అయితే, ఒక్క కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠం దక్కించుకునే విషయంలోనే వ్యూహాత్మక వైఫల్యం జరిగిందని, దీనిపై సమీక్ష చేస్తామని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

## నాలుగు లైన్ల ‘గ్రాండ్’ కారిడార్

హైదరాబాద్

దక్షిణఉత్తర భారత్‌లను రైల్వే మార్గంతో జోడించే కీలక గ్రాండ్ ట్రంక్ రూట్‌లో నాలుగో లైన్ నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. దేశంలోనే అత్యంత బిజీ మార్గాల్లో ఇది ఒకటి. నిత్యం 160 రైళ్లు తిరిగే ఈ మార్గం పూర్తిస్థాయి పరిమితికి చేరుకోవడంతో కొత్త రైళ్లను నడపడం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో మూడో లైన్‌ను నిర్మిస్తున్నారు. మరో మూడు నెలల్లో ఆ పనులు పూర్తి కానున్నాయి. దీంతో ఆ రూట్‌లో అదనంగా మరో 100 రైళ్లు నడిపేందుకు వెసులుబాటు కలిగింది. ఇక్కడితో ఆగిపోకుండా రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్గంలో నాలుగో లైన్‌ను కూడా నిర్మించాలని నిర్ణయించింది. అధికారికంగా దీనికి మంజూరు ఇవ్వనప్పటికీ సర్వే పనులను ప్రారంభించి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టేందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి కాజీపేట మీదుగా విజయవాడ వరకు నాలుగో లైన్ నిర్మాణానికి రూ. 5 వేల కోట్లు ఖర్చవుతాయని రైల్వేశాఖ అంచనా వేస్తోంది. డీపీఆర్ పూర్తయ్యాక ఖర్చు విషయంలో మరింత స్పష్టత రానుంది. ప్రస్తుతం ఈ మార్గంలో మూడో లైన్ నిర్మాణం పూర్తి కావచ్చింది. బల్లార్షాకాజీపేట మధ్య 201 కి.మీ. మూడో లైన్ ఇప్పటివరకు 183 కి.మీ. మేర పూర్తయింది. మిగతాది పురోగతిలో ఉంది. బెల్లంపల్లి మందమర్రి ఆసిఫాబాద్ సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య పనులు జరుగుతున్నాయి. దీనికి రూ. 3 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. కాజీపేటవిజయవాడ మధ్య 219 కి.మీ. మేర పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 195 కి.మీ. పూర్తయ్యాయి. డోర్నకల్‌మహబూబాబాద్ మధ్య 24 కి.మీ. మేర పనులు జరుగుతున్నాయి. దీనికి రూ. 3,300 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి కానున్నాయి. ఇది దేశంలోనే ప్రధాన కారిడార్ అయినందున భవిష్యత్తులో రైళ్ల సంఖ్యను భారీగా పెంచాలనేది కేంద్రం ఆలోచన. ప్రయాణికుల రైళ్లతోపాటు సరుకు రవాణా రైళ్లను విస్తృతంగా తిప్పాలని భావిస్తోంది. ప్రస్తుతం 424 కి.మీ. మేర నాలుగో లైన్ కోసం సర్వే జరుగుతోంది. మరో మూడు నెలల్లో డీపీఆర్ పూర్తి చేసి ప్రాజెక్టు పనులను పట్టాలెక్కించాలని రైల్వే శాఖ భావిస్తోంది. నాలుగేళ్లలో పనులు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. భూసేకరణలో జాప్యం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వేగంగా కొలిక్కి తెచ్చి నిధుల సమస్య రాకుండా పనులను పరుగెత్తించాలని భావిస్తోంది. ఇది పూర్తయితే ప్రస్తుతం నడుస్తున్న రైళ్ల సంఖ్య కంటే రెట్టింపు సంఖ్యలో రైళ్లు తిరిగేందుకు వీలు కలుగుతుంది. ఈ కారిడార్ పరిధిలో సిమెంటు పరిశ్రమలు, బొగ్గు గనులు ఉన్నందున వాటి ఉత్పత్తుల తరలింపు భారీగా పెరగనుంది. వ్యవసాయ ఉత్పత్తులు, పాలు, ఎరువుల సరఫరా మెరుగవనుంది. రైల్వేకు దీని వల్ల భారీ ఆదాయం లభించనుంది. ఇక ప్రస్తుతం గ్రాండ్ ట్రంక్ రూట్ దేశ రైలు అవసరాల్లో 40 శాతం తీరుస్తోంది. ఈ మార్గంలో భవిష్యత్తులో సెమీ హైస్పీడ్ రైళ్ల సంఖ్య భారీగా పెరగనున్న నేపథ్యంలో ట్రాక్‌ను 180 కి.మీ. వేగాన్ని తట్టుకునే సామర్థ్యంతో నిర్మించనున్నారు.

## తొర్రూరులో రసాభాస.. ఎన్నిక నేటికి వాయిదా

**తొర్రూరులో కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి కార్యకర్తల బాహాబాహీ**

తొర్రూరు



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది. ఇక్కడ మొత్తం 16 వార్డుల్లో భారత రాష్ట్ర సమితి 9, కాంగ్రెస్ 7 గెలుచుకున్నాయి. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్యల ఎక్స్ అఫీషియో ఓట్లతో కలిసి కాంగ్రెస్ సంఖ్య తొమ్మిదికి పెరిగి.. రెండు పార్టీల బలాలు సమానమయ్యాయి. ఎన్నిక ప్రక్రియ ప్రారంభించాక.. ఎంపీ కావ్యకు ఎక్స్‌అఫీషియో ఓటు లేదని, గతంలో ఆమె వరంగల్ కార్పొరేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారని భారత రాష్ట్ర సమితి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆర్డీవో గణేష్ చర్చించుకునేందుకు సభ్యులకు కొంత సమయం ఇచ్చినా ఫలితం లేకపోవడంతో ఎన్నికను వాయిదా వేశారు. ఎన్నిక నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన పీఏ భాస్కర్‌తో కలిసి మున్సిపల్ కార్యాలయం లోపలికి వెళ్లడంతో కాంగ్రెస్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో దయాకర్ బయటికి వచ్చేసినా.. పీఏ లోపలే ఉన్నారు. పీఏ బయటకు రావాలంటూ నినాదాలు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు.. ఆయన బయటికి రాగానే దాడికి పాల్పడడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎస్పీ శబరీష్ అదనపు బలగాలతో చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

# ఘనంగా ప్రారంభమైన ఇండియా ఏఐ ఎక్స్‌పో!

న్యూఢిల్లీ

ఎప్పుడెప్పుడా అని అంతా ఆసక్తిగా ఎదురు చూసిన ప్రపంచ స్థాయి కృత్రిమ మేధ సదస్సు 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో' సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఢిల్లీలోని భారత మండపంలో సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీ సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పలు కంపెనీలు, స్టార్టప్‌లు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన కలియదిరిగారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులతో మాటలు కలిపారు. వారి పరిశోధనలు తదితరాలను గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 20వ తేదీ దాకా జరిగే ఈ ఐదు రోజుల సదస్సులో 600కు పైగా భారీ స్థాయి స్టార్టప్‌లు పాలుపంచుకోనున్నాయి. వాటితో పాటు 13 దేశాలకు చెందిన ఏఐ పెవీలియన్లు తమ ప్రత్యేకతను చాటేందుకు సిద్ధమయ్యాయి. గ్లోబల్ సౌత్‌లో తొలిసారిగా జరుగుతున్న ఈ సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వాతో పాటు 20 మందికి పైగా దేశాధినేతలు, 60కి పైగా దేశాల నుంచి మంత్రులు పాల్గొంటున్నారు. అంతేగాక గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌తో పాటు పలు ఏఐ దిగ్గజ కంపెనీలకు చెందిన 40 మందికి పైగా సీఈఓలు కూడా హాజరై ఈ రంగంలో విస్తరణకు అమలు చేయదలచిన ప్రణాళికలు తదితరాలను ఆహూతులతో పంచుకోనున్నారు. 19వ తేదీన సదస్సును ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. అదే తేదీన మాక్రాన్ కూడా సదస్సులో పాల్గొంటున్నారు. భారత్‌కే గాక ప్రపంచమంతటికీ పలు రంగాలకు సంబంధించిన కీలక సవాళ్లకు ఈ సదస్సు సమర్థమైన పరిష్కారాలు చూపగలదని ప్రధాని విశ్వాసం వెలిబుచ్చారు. ఇన్నొవేటర్లు, పరిశోధకులు, టెక్ ఔత్సాహికుల నడుమ గడపడం ఎనలేని ఆనందాన్ని ఇచ్చినట్టు ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. "ఇండియా ఏఐ ఎక్స్‌పోను ప్రారంభించా. ఇంతటి కీలకమైన సదస్సుకు భారత్ ఆతిథ్యమిస్తుండటం హర్షణీయం"అన్నారు. 'గ్లోబల్ ఏఐ గవర్నెన్స్'కు ఈ సదస్సు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందజేస్తుందని ఆయన విశ్వాసం వెలిబుచ్చారు.



అంతకుముందు వేదిక వద్ద జియో ఏఐ ఎకో సిస్టమ్స్ స్టాల్‌ను ప్రధాని ఆసక్తిగా పరిశీలించారు.

**తొలి రోజు విస్తృత చర్చలు**

ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పోకు కేంద్రం భారీస్థాయిలో ఏర్పాట్లు చేసింది. భారత్ మండపంలో 10 వేదికల్లో 70 వేల చదరపు మీటర్లకు పైగా విస్తరించిన ప్రాంతంలో స్టాళ్లు, స్టార్టప్‌లు, ఏఐ వేదికలు కనువిందు చేస్తున్నాయి. సోమవారం ఉదయానికే భారీ సంఖ్యలో తరలివచ్చిన పలు ప్రఖ్యాత ఏఐ సంస్థల సీఈఓలు, పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు తదితరులతో వేదికతో పాటు పరిసరాల్లోని హాల్లన్నీ నిండిపోయాయి. వారంతా బృందాలుగా ఏర్పడి పలు రంగాల్లో ఏఐ ప్రభావం, దాని మంచిచెడులను గురించి చర్చోపచర్చల్లో మునిగితేలారు. మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు ప్రపంచ స్థాయి దిగ్గజ ఏఐ సంస్థలు, స్టార్టప్లు, విద్యా సంస్థలు, పరిశోధన సంస్థలు, పలు దేశాలకు చెందిన ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థలు ఒకే వేదికపైకి వచ్చి పరస్పరం అనుభవాలు, అభిప్రాయాలను పంచుకోనున్నాయి.

ఏఐ దెబ్బకు పలు రంగాల్లో భారీగా కొనసాగుతున్న కొలువుల కోత మొదలుకుని బాలల భద్రత దాకా భిన్నమైన అంశాలు, సమస్యలపై చర్చలు, పరిష్కార మార్గాల అన్వేషణకు సదస్సు వేదిక కానుంది. 13కు పైగా దేశాలు ఇప్పటికే మండపంలో ప్రత్యేక పెవీలియన్లు ఏర్పాటు చేశాయి. ఆస్ట్రేలియా, జపాన్, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సెర్బియా, ఎస్టోనియా, తజకిస్తాన్ వంటివి వీటిలో ఉన్నాయి. 300కు పైగా క్యూరేటెడ్ ఎగ్జిబిషన్ పెవీలియన్లు ఆకట్టుకోనున్నాయి. 'పీపుల్, ప్లానెట్, ప్రోగ్రెస్' థీమ్‌తో కూడిన లైవ్ డెమాన్‌స్ట్రేషన్లు కంపెనీల ఏఐ ప్రణాళికలను కళ్లకు కట్టనున్నాయి. రెండున్నర లక్షల మందికి పైగా ఏఐ సదస్సును సందర్శిస్తారని భావిస్తున్నారు.

# శబరిమల వివాదంపై విస్తృత ధర్మాసనం

న్యూఢిల్లీ


శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశానికి సంబంధించిన వివాదంపై 9 మంది న్యాయమూర్తులతో కూడిన విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరపనుంది. శబరిమల ఆలయంలో అన్ని వయసుల మహిళలకూ ప్రవేశం కలిగిస్తూ ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2018లో తీర్పు వెలువరించడం తెలిసిందే. దాన్ని సవాలు చేస్తూ దాఖలైన 67 పిటిషన్లపై విస్తృత ధర్మాసనం తుది విచారణ జరపనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీ ధర్మాసనం సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తుది విచారణకు ఏప్రిల్ 7 నుంచి 22 దాకా రెండు వారాల సమయం కేటాయిస్తున్నట్టు వెల్లడించింది. 2018 నాటి తీర్పును వ్యతిరేకించే పక్షాల వాదనలను ఏప్రిల్ 7 నుంచి 9 వరకు ధర్మాసనం ఆలకించనుంది. ఆ తీర్పును సమర్థించే పక్షాలు ఏప్రిల్ 14 నుంచి 16 దాకా వాదనలు వినిపిస్తాయి.

ఏప్రిల్ 22 నాటికి విచారణను ధర్మాసనం పూర్తి చేయనుంది. మహిళల మతపరమైన స్వేచ్ఛ, ప్రార్థన స్థలాల్లో వారిపై వివక్షకు సంబంధించి ఇప్పటికే దాఖలైన పలు ఇతర పిటిషన్లను కూడా శబరిమల పిటిషన్లతో పాటే విచారిస్తుంది. మసీదులు, దర్గాల్లోకి మహిళల ప్రవేశంపై నిషేధం, పార్శీయేతర పురుషులను పెళ్లాడే పార్శీ మహిళలకు అగ్ని దేవాలయాల్లోకి ప్రవేశంపై నిషేధం, దావూదీ బోహ్రా సామాజిక వర్గంలో మహిళల్లో అంగవిచ్ఛిత్తి ఆచారం తదితరాలు వీటిలో ఉన్నాయి.

ఈ నేపథ్యంలో ఆయా మతాల్లో మహిళలకు మతపరమైన స్వేచ్ఛ, ప్రార్థన స్థలాల్లో వారి ప్రవేశంపై నిషేధం తదితరాలకు సంబంధించిన అంశాలపై కూడా ధర్మాసనం కూలంకషంగా విచారణ జరపనుంది. "ఈ అంశాలకు సంబంధించి ధర్మాసనం లోతుగా విచారణ జరిపి పూర్తి న్యాయం చేకూరుస్తుంది. ఆ మేరకు వాటిపై న్యాయపరంగా ఒక సమగ్ర విధానాన్ని రూపొందిస్తుంది"అని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ప్రార్థన స్థలాల నిర్వాహకులు తమ అభిప్రాయాలు, వాదనలతో మార్చి 14 లోపు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

**2018 నాటి వివాదం...**

కేరళలోని ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప ఆలయంలోకి రుతుక్రమంలో ఉన్న మహిళల ప్రవేశంపై శతాబ్దాలుగా నిషేధం కొనసాగుండటం తెలిసిందే. ఆ మేరకు 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు మహిళలకు ప్రవేశం లేదు. ఇది చట్టవిరుద్ధమే గాక రాజ్యాంగానికి కూడా విరుద్ధమని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2018 సెప్టెంబర్‌లో



పేర్కొంది. వారి ప్రవేశంపై నిషేధాన్ని తొలగిస్తూ 4:1 మెజారిటీతో తీర్పు వెలువరించింది.

దీనిపై కేరళతో పాటు దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు, వ్యతిరేకతలు వ్యక్తమయ్యాయి. ఆ తీర్పును సవాలు చేస్తూ ఏకంగా 67 పిటిషన్లు దాఖలయ్యాయి. 2019లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్ సారథ్యంలోని మరో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం వాటిపై విచారణ జరిపింది. శబరిమలతో పాటు మొత్తంగా ప్రార్థన స్థలాల్లో మహిళలపై వివక్ష అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదిస్తూ 3:2 మెజారిటీతో తీర్పు వెలువరించింది.

**ఏడు అంశాలపై విచారణ**

మహిళల మతపరమైన స్వేచ్ఛకు సంబంధించి మొత్తం ఏడు అంశాలపై విస్తృత ధర్మాసనం విచారణ జరుపుతుందని సీజేఐ ధర్మాసనం ప్రాథమికంగా పేర్కొంది. అవి...

- రాజ్యాంగంలోని 25వ ఆర్టికల్‌లో పేర్కొన్న ప్రకారం మతపరమైన స్వేచ్ఛకున్న పరిధి ఏ మేరకు?
- ఆర్టికల్ 25లో పేర్కొన్న వ్యక్తిగత మత స్వేచ్ఛ, ఆర్టికల్ 26లో పేర్కొన్న మతపరమైన సంస్థల అధికారాల మధ్య సంబంధాలు ఎలాంటివి?
- ఆర్టికల్ 26లో పేర్కొన్న మతపరమైన అంశాలు చట్టపరమైన ఇతర నియమ నిబంధనలకు, నైతిక, ఆరోగ్యపరమైన అంశాలకు లోబడాలా?
- ఆర్టికల్ 25, 26లో పేర్కొన్న నైతికత తాలూకు పరిధి ఏమిటి? ఈ విషయంలో రాజ్యాంగపరమైన నైతికతను ఎలా అర్థం చేసుకోవాలి?
- ఆర్టికల్ 25లో పేర్కొన్న మతపరమైన పద్ధతులు, ఆచారాలపై న్యాయసమీక్షకు ఉన్న ఆస్కారం ఏ మేరకు?
- ఆర్టికల్ 25 (2) (బి)లో పేర్కొన్న హిందూ వర్గాలు అంటే ఎవరు?
- ఏదైనా మతపరమైన ఆచరణను వ్యతిరేకిస్తూ ఆ మతంతో సంబంధం లేనివారు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయవచ్చా?"

**సమీక్షకే మా ఓటు: కేంద్రం**

**ఆచితూచి నిర్ణయం: కేరళ**

న్యూఢిల్లీ/త్రివేండ్రం/కొట్టాయం: శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై నిషేధం ఎత్తివేత తీర్పుపై సమీక్షను కేంద్రం సమర్థిస్తున్నట్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. సోమవారం విచారణ సందర్భంగా సీజేఐ ధర్మాసనానికి ఈ మేరకు ఆయన నివేదించారు. కేరళ ప్రభుత్వం మాత్రం ప్రస్తుతానికి సమీక్షను వ్యతిరేకిస్తోందని సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా ధర్మాసనానికి తెలిపారు. అయితే, ఈ అంశంపై సంబంధిత వర్గాలతో సమగ్రంగా చర్చించిన అనంతరమే ప్రభుత్వ వైఖరిపై తుది నిర్ణయం తీసుకుంటామని కేరళ న్యాయ శాఖ మంత్రి పి.రాజీవ్ పేర్కొన్నారు. "ఇది చాలా సంక్లిష్టమైన వ్యవహారం. కనుక దీనిపై అవును, కాదు అని ఇప్పటికిప్పుడు స్పష్టమైన వైఖరికి రావడం సులువు కాదు. హిందూ మత విశ్వాసాలపై లోతైన అవగాహన ఉన్న నిపుణులతో దీనిపై కమిటీ వేయాలని గత అఫిడవిట్‌లో మేం పేర్కొన్నాం కూడా"అన్నారు. అయితే ఈ విషయంలో మత విశ్వాసాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. కేరళలో సీపీఎం సారథ్యంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో, శబరిమల వివాదంపై ప్రభుత్వం, పార్టీ ఏక వైఖరితో ఉండాల్సిన అవసరం లేదని సీపీఎం పేర్కొంది.

**ప్రభుత్వ వైఖరి మారాలి**

రుతుక్రమంలో ఉన్న మహిళలు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించేందుకు వీల్లేదని కేరళకు చెందిన రెండు ప్రధాన హిందూ కుల సంస్థలు నాయర్ సర్వీస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్), శ్రీ నారాయణ ధర్మ పరిపాలన (ఎన్ఎన్‌డీపీ) యోగం పునరుద్ఘాటించాయి. ఈ విషయంలో తమ వైఖరిలో మార్పు లేదని అవి స్పష్టం చేశాయి.

## మతపరమైన ప్రదేశాల్లో మహిళల వివక్ష కేసు

కేరళలోని శబరిమల ఆలయంతో సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళల ప్రవేశంపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును విచారించేందుకు తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ఈ విచారణను ధర్మాసనం ఏప్రిల్ 7న ప్రారంభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమల్య బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం చెప్పింది. ఇది ఏప్రిల్ 22 నాటికి ముగిసే అవకాశం ఉందని పేర్కొంది. మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక వాదనలను సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. శబరిమలతో పాటు మసీదులు, దర్గాలోకి మహిళల ప్రవేశంపై కూడా విచారించనుంది. అలాగే ఇతరులను పెళ్లి చేసుకున్న పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవడ వంటి అంశాలపై పరిగణనలోకి తీసుకుంది. అయితే నిర్ణయించిన షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాలని అన్ని పక్షాలకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటు చేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని తెలిపారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

## నేడు ముంబైలో మోదీ, మేక్రాన్ భేటీ



న్యూఢిల్లీ

నేడు భారత పర్యటనకు విచ్చేస్తున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ వెనువెంటనే భారత ప్రధాని మోదీతో భేటీకానున్నారు. ముంబై ఇందుకు వేదికకానుంది. భారత్‌ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో పురోగతితో పాటు ఇరుదేశాల ద్వైపాక్షిక బంధంపై అగ్రనేతలు సమీక్ష జరపనున్నారు. వ్యూహాత్మక బంధం బలోపేతం చేయడంతోపాటు నూతన, కొత్తగా ఉద్భవిస్తున్న రంగాల్లోనూ సహకారాన్ని విస్తృత పర్చుకోవడంపై ఇరునేతలు ప్రధానంగా దృష్టిసారించనున్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యాంశాల పైనా నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ప్రధాని మోదీ ఫిబ్రవరి 17వ తేదీన ఢిల్లీ నుంచి ముంబైకి చేరుకున్నాక మేక్రాన్‌తో చర్చిస్తారని కేంద్రం ఒక అధికారిక ప్రకటన వెలువర్చింది. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొనాలంటూ ప్రధాని మోదీ ఆహ్వానించడంతో మేక్రాన్ భారత్‌లో పర్యటిస్తున్నారని ఆ ప్రకటన పేర్కొంది. మేక్రాన్ ఢిల్లీకి రావడం ఇది నాలుగోసారి కాగా ముంబైలో పర్యటించడం ఇదే తొలిసారి. మంగళవారం ముంబైలోని లోక్‌భవన్‌లో మోదీ, మేక్రాన్ చర్చలు మధ్యాహ్నం 3.15 గంటలకు మొదలుకానున్నాయి. సాయంత్రం 5.15 గంటలకు ఇండియాఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్ 2026ను ఆవిష్కరిస్తారు. తర్వాత ఇరుదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలు, పరిశోధకులు, ఇతర ఆవిష్కర్తలనుద్దేశించి మోదీ, మేక్రాన్ ప్రసంగిస్తారు.

## తొలి బోర్డు పరీక్షలకు హాజరు తప్పనిసరి



న్యూఢిల్లీ

పదో తరగతి వార్షిక పరీక్షల విషయంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సోమవారం కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది నుంచి వార్షిక పరీక్షలను రెండుసార్లు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వాటిలో తొలి విడత బోర్డు పరీక్షలను రాయడం విద్యార్థులందరికీ తప్పనిసరి అంటూ సీబీఎస్ఈ స్పష్టత ఇచ్చింది. "విధిగా కనీసం మూడు సబ్జెక్టుల్లో పరీక్షలు రాసి తీరాల్సిందే. అలా రాయని వారిని 'ఎసెన్షియల్ రిపీట్'కేటగిరీగా పరిగణిస్తాం. వారిని మేలో జరిగే రెండో బోర్డు పరీక్షల్లో రాసేందుకు అనుమతించబోం. వారు తిరిగి వచ్చే విద్యా సంవత్సరంలోనే వార్షిక పరీక్షలు రాయాల్సి ఉంటుంది"అని ప్రకటించింది. సీబీఎస్ఈ పదో తరగతి, 12వ తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం నుంచి మొదలవుతున్న నేపథ్యంలో బోర్డు ఈ మేరకు వెల్లడించింది. 2026 నుంచి ఏటా రెండుసార్లు వార్షిక పరీక్షలు నిర్వహించాలని సీబీఎస్ఈ బోర్డు నిర్ణయించడం తెలిసిందే. దానిప్రకారం తొలి విడత పరీక్షలను ఫిబ్రవరిలో నిర్వహించి ఏప్రిల్లో ఫలితాలు వెల్లడిస్తారు. అనంతరం మేలో రెండో విడత పరీక్షలు జరుగుతాయి. "మార్కులు పెంచుకోదలచిన విద్యార్థులు వాటిని రాయవచ్చు. అయితే ఏవైనా మూడు సబ్జెక్టుల్లో మాత్రమే రెండోసారి పరీక్ష రాసేందుకు అనుమతిస్తారు"అని సీబీఎస్ఈ పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ వివరించారు. తొలి బోర్డు పరీక్షల్లో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులను కంపార్ట్‌మెంట్ విభాగంలో మేలో రెండో బోర్డు పరీక్షలకు అనుమతిస్తారని తెలిపారు.

## యక్షగానంలో దుమ్మురేపిన దివ్యాంగ బాలలు

ఆంధ్రప్రదేశ్‌లో కూచిపూడి, తెలంగాణలో చిందు భాగవతం లాగే కర్ణాటకలో యక్షగానం ఫేమస్. విశేషం ఏమిటంటే, యక్షగానం ప్రదర్శనలో పురుషులే భాగమవుతారు. స్టేజీపైకి వచ్చి యక్షగానం ప్రదర్శన ఇచ్చేందుకు ఒక్కో కళాకారుడు ఏళ్ల తరబడి శ్రమిస్తుంటాడు. కానీ కొందరు దివ్యాంగ బాలురు కేవలం 6 నెలల శిక్షణతో స్టేజీపై దుమ్మురేపారు. నటన, భావోద్వేగం, పాత్రలకు తగిన ముఖ కవళికలు, ఆకట్టుకునే ఆహార్యంతో భళా అనిపించారు. శిక్షణ, అవకాశం లభిస్తే ఏ కళారూపంలోనైనా తాము రాణించగలరని చాటి చెప్పారు. మంగళూరుకు చెందిన దివ్యాంగ బాలల కళా నైపుణ్యంపై కథనమిది. మంగళూరు నగరంలోని శక్తినగర్‌లో సానిధ్య స్పెషల్ చిల్డ్రన్స్ స్కూల్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఉంది. ఇందులో ఎంతోమంది దివ్యాంగ బాల, బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యాసంస్థలో విద్యార్థులకు చదువుతో పాటు డ్యాన్సింగ్, సింగింగ్, పెయింటింగ్ లాంటి కళలు, స్వయం ఉపాధి పనులనూ నేర్పిస్తుంటారు. సానిధ్య ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవం సందర్భంగా ఏటా మంగళూరు నగరంలోని అతిపెద్ద కద్రి పార్కులో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. వీటిని చూసేందుకు యావత్ నగరం నుంచి ప్రజలు తరలి వస్తుంటారు. ఈసారి వార్షికోత్సవం కోసం కొన్ని నెలలు ముందు నుంచే పిల్లలకు వివిధ కళారూపాలలో ట్రైనింగ్ ఇచ్చారు. పిల్లలు యక్షగానం నేర్చుకోవడం చాలా టఫ్. అందుకే ఆరు నెలల ముందు నుంచే ఈవిభాగంలో 15 మంది బాలురకు ట్రైనింగ్‌ను మొదలుపెట్టారు. ఈసారి కద్రి పార్కులో నిర్వహించిన సానిధ్య ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవంలో దివ్యాంగ బాలురు ప్రదర్శించిన యక్షగానం అందరినీ ఆకట్టుకుంది. 'వరాహ అవతారం' అనే పురాణ గాథపై బాలురు ఇచ్చిన యక్షగానం ప్రదర్శన అందరి మన్ననలు అందుకుంది. భూదేవిని రక్షించేందుకు విష్ణుమూర్తి ధరించే వరాహ అవతారమే ఈ పురాణ గాథలోని ముఖ్యాంశం. శ్రీమహావిష్ణువు ధరించిన పది ప్రధాన అవతారాలలో వరాహ అవతారం మూడోది. దీనిపై యక్షగానం ప్రదర్శన కోసం ముందుగానే సానిధ్య ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు డైలాగ్‌లను కళాకారులతో చెప్పించి, ప్రత్యేక స్టూడియోలో వాటిని రికార్డు చేయించారు. ఆ రికార్డెడ్ డైలాగ్‌లను కద్రి పార్కులో ఏర్పాటు చేసిన స్టేజీపై ప్రదర్శించారు. ఈ డైలాగ్‌లకు అనుగుణంగా దివ్యాంగ బాలలు అద్భుతంగా జీవకళ ఉట్టిపడేలా భావ వ్యక్తీకరణ చేశారు. వారి ముఖ కవళికలు, కాళ్ల కదలికలు, ఆహార్యం, భావోద్వేగాలను వ్యక్తం చేసిన తీరు వీక్షకుల మనసులను హత్తుకుంది. యక్షగానంలో తమకు కేటాయించిన పాత్రల్లో ఆ బాలలు జీవించిపోయారు. రికార్డెడ్ సౌండ్‌లను వింటూ ఆ పిల్లలు నటిస్తున్నారు అంటే వీక్షకులు ఎవరూ నమ్మలేకపోయారు. అంతగా పాత్రల్లో దివ్యాంగ బాలలు ఇమిడిపోయారు. ఈ యక్షగాన కళారూపం ప్రదర్శనకు కద్రి ఏరియాకు చెందిన కళాకారుడు శరత్ కుమార్ కద్రి దర్శకత్వం వహించారు. సహాయ దర్శకుడిగా సుజీత్ కుమార్ వ్యవహరించారు.

## సంపాదకీయం

# ఈ ఒప్పందంతో.. దేశ రైతాంగానికి ఉరే!

భారత్–అమెరికా మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందం దేశ రాజకీయాల్లోనే కాకుండా వ్యవసాయ రంగంలోనూ తీవ్ర చర్చకు దారి తీసింది. అమెరికా అధికార వర్గాలు దీన్ని తమ రైతులకు లాభదాయకమని పేర్కొనడంతో..ఈ ఒప్పందం రైతాంగానికి ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. ఈ నేపథ్యంలో, ఈ వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడం సైతం సర్వత్రా విమర్శలకు కారణమైంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, పలువురు ప్రతిపక్ష నేతలు ఈ వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాడి పరిశ్రమలకు సంబంధించిన ప్రయోజనాలను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా, మోడీ ప్రభుత్వం ఎవరి విజ్ఞప్తులను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఇప్పటికే మోడీ ప్రభుత్వ నిరంకుశపూరిత వైఖరికి నిరసనగా.. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా రైతు సంఘాలు సమ్మె నిర్వహించాయి. ఈ ఒప్పందం మీద అమెరికా మంత్రి బ్రూక్ రోలిన్స్ మాట్లాడుతూ.. ఈ నిర్ణయం అమెరికా రైతులకు లాభదాయకమని అభివర్ణించారు.. కానీ, భారతీయ రైతులకు ఈ ఒప్పందం శరఘాతంలా మారిన విషయం ప్రధాని మోడీ ఆయన పరివారం ఎందుకు గుర్తించడం లేదో? కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అమెరికా సోయాబీన్ ఆయిల్, డిస్టిలర్స్ గ్రెయిన్స్‌కు భారత మార్కెట్ తలుపులు తెరవడం ద్వారా దేశీయ రైతును తన నేలపైనే పోటీ చేయలేని స్థితికి నెట్టివేస్తున్నారు. చౌక విదేశీ దిగుమతులు పాడి, పశుసంవర్ధక రంగాలను కూల్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తాయి. 'పంట మనది – లాభం పరాయిది' అనే దోపిడీ విధానాన్ని దేశంపై ప్రధాని మోడీ బలవంతంగా రుద్దుతున్నారు.. ఎంఎస్పీ హామీలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం నేడు అంతర్జాతీయ డంపింగ్‌కు ద్వారాలు తెరిచి రైతును బలి చేస్తోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.. రైతు రక్షణ ముసుగులో అమెరికా బహుళజాతి సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నది. ఈ ఒప్పందం భారత ఆహార భద్రతను బలహీనపరిచే కుట్రనే. దేశానికి సంబంధించిన ఇంతటి కీలక నిర్ణయం తీసుకునే ముందు... రాష్ట్రాలను సంప్రదించక పోవడం, పార్లమెంటులో చర్చ జరపకపోవడం, రైతు సంఘాల అభిప్రాయాన్ని లెక్కలోకి తీసుకోకపోవడం ప్రజాస్వామ్య విలువల స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించారు. ఇది రాజ్యాంగ విలువల్నీ పాతరేయడం కిందకు వస్తుంది. ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి రైతుకు చట్టబద్ధ రక్షణ కల్పించాల్సిన అసవరముంది. దేశాన్ని పోషించే రైతును బలి చేసి ఏ ప్రభుత్వం నిలబడలేదన్న విషయం మోడీ గుర్తించుకోవాలి. ఈ ఒప్పందం పాడి పరిశ్రమపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. అమెరికా నుండి పౌల్ట్రీ ఉత్పత్తులు, డిస్టిలర్స్ గ్రెయిన్స్ (పశువుల మేతగా వాడేవి) దిగుమతి అయితే, దేశీయ పశు గ్రాసం ధరలు పడిపోయతాయి. పాడి రైతులకు ఆదాయం తగ్గుతుంది. మన అవసరాలకు సరిపడా ఆహారాన్ని మనమే పండించుకోకుండా, దిగుమతులపై ఆధారపడితే.. భవిష్యత్తులో అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. అందుకే రైతులు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, దానిని ఒక చట్టపరమైన హక్కుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న వ్యవసాయం గురించి కేంద్రం నిర్ణయాలు తీసుకునేటప్పుడు రాష్ట్రాలను సంప్రదించ కపోవడంపై ఆగ్రహం కల్పించడం జరుగుతున్నది. వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థల ప్రవేశం వల్ల రైతు కేవలం ఒక 'కూలీ'గా మారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశం. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ఇలాంటి ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల కేంద్ర–రాష్ట్రాల సయోధ్య పోతుంది. ఇంతటి కీలకమైన మార్కెట్ మార్పులపై పార్లమెంటులో చర్చ జరగకపోవడం వల్ల, భవిష్యత్తులో తలెత్తే లోటుపాట్లను సరిదిద్దే అవకాశం లేకుండా పోతుంది. అమెరికా వంటి దేశాల్లో యాంత్రీకృత వ్యవసాయం వల్ల ఖర్చులు తక్కువ, కానీ భారత్‌లో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు.. వీరిద్దరి మధ్య పోటీ అనేది అసమానమైనది. ఈ విషయాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ఒప్పందాన్ని వెనక్కి తీసుకొని... భారత రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# టీచర్లకు ఎఐ ప్రత్యామ్నాయమా?


ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అనేది ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం అవుతుందా అనే చర్చ జరుగుతోంది. అది ఒక సహాయక సాధనం మాత్రమే. తరగతి గదిలో మానవ స్పర్శ, సానుభూతి, స్ఫూర్తిని ఎఐ భర్తీ చేయలేదని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎఐ అనేది ఉపాధ్యాయుల పాత్రను మెరుగుపరచడానికి ఉద్దేశించింది. అయితే వారిని భర్తీ చేయడానికి కాదంటున్నారు. ఎఐ పరిపాలనా పనులను ఆటోమేట్ చేయగలదు, వ్యక్తిగతీకరిం చిన అభ్యాస అనుభవాలను అందించగలదు.మానవ సంబం ధాలను నిర్మించడానికి, మానసిక మద్దతును అందించడానికి, అర్థవంతమైన అభ్యాస అనుభవాలను సులభతరం చేయడానికి మానవులైన ఉపాధ్యాయులు ఇప్పటికీ చాలా అవసరం. వారి నేపథ్యం లేదా సామర్థ్యాలతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ ఎఐ సాధనాలు అందుబాటులో ఉంటాయి. విద్యలో ఎఐ అమలులో 'సమానత్వం' అనేది ఒక ముఖ్యమైన అంశంగా ఉండాలి. వ్యక్తిగతీకరించిన బోధన, తక్షణ అభిప్రాయం, లక్షిత జోక్యాలను అందించడం ద్వారా ఎఐ అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తుంది. ఇది విద్యార్థుల ప్రత్యేక అవసరాలు, అభ్యాస శైలిలకు అనుగుణంగా అభ్యాస సామగ్రిని మార్చగలదు. అంతేకాకుండా అభ్యాసకుల గోప్యత, డేటా భద్రత కలిగి ఉంటాయి. విద్యార్థుల డేటాను రక్షించడానికి బలమైన గోప్యతా విధానాలు, భద్రతా చర్యలను కలిగి ఉండటం ఎంతో ముఖ్యం. ఈ ప్రశ్నలు, ఆందోళనలను పరిష్కరించడం ద్వారా, విద్యావేత్తలు విద్యలో ఎఐ అమలు గురించి సరైన నిర్ణయాలు తీసుకోవచ్చు. విద్యలో ఎఐ రంగం నిరంతరం అభివృద్ధి చెందుతోంది. భవిష్యత్తులో అనేక ట్రెండ్స్‌ని అనుసరిస్తుంది. విద్యార్థుల వ్యక్తిగత అవసరాలను తీర్చడానికి అభ్యాస సామగ్రిని, జోక్యాలను సర్దుబాటు చేయడంలో ఎఐ వ్యవస్థలు మరింత అధునాతనంగా మారతాయి. ఈ వ్యక్తిగతీకరించిన విధానం అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరుస్తుంది. ఎఐ –ఆధారిత చాట్‌బాట్‌లు, వర్చువల్ అసిస్టెంట్‌లు సహజ భాషను అర్థం చేసుకోవడంలో, ప్రతిస్పందించడంలో మరింత అభివృద్ధి చెందుతాయి. విద్యార్థులకు తక్షణ మద్దతు, మార్గదర్శకత్వాన్ని అందిస్తాయి. విద్యా డేటాను విశ్లేషించడంలో, విద్యావేత్తల కోసం కార్యాచరణ విధానాలను రూపొందించడంలో ఎఐ అల్గారిథమ్‌లు మెరుగుపడుతూనే ఉంటాయి. ఇది డేటా ఆధారిత నిర్ణయాధికారం, వ్యక్తిగతీకరించిన బోధనను సాధ్యం చేస్తుంది. ఎఐ సాంకేతికతలు అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీతో అనుసంధానించబడతాయి. ఈ ధోరణులు విద్యను మార్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మరింత ఆకర్షణీయమైన, సమర్థవంతమైన అభ్యాస వాతావరణాలను




సృష్టిస్తాయి. విద్యలో ఎఐ అనేక ప్రయోజనాలను అందిస్తుంది. విద్యలో ఎఐని అమలు చేయడం అనేది నమ్మదగిన డేటా లభ్యత, ప్రత్యేక సాంకేతిక నైపుణ్యం వంటి సవాళ్లతో కూడి ఉంటుంది. ఉత్తమ పద్ధతులను అనుసరించడం ద్వారా, విద్యావేత్తలు తరగతి గదిలో ఎఐని విజయవంతంగా అనుసరించి ఫలితాలు సాధించవచ్చు. విద్యా రంగంలో ఆన్‌లైన్ కోర్సుల రూపకల్పన, నిర్వహణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎన్నో అవకాశాలను కలిగిస్తోంది. విద్యావేత్తలను శ్రమతో కూడిన పనులనుండి విముక్తి చేస్తుంది. ఇది సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, కంటెంట్ ఎల్లప్పుడూ ప్రస్తుత పరిస్థితులకు తగినట్లుగా ఉండేలా చూస్తుంది. పరిపాలనా పనులను ఇప్పుడు ఎఐ ఉపయోగించి ఆటోమేట్ చేయవచ్చు. దీనివల్ల అధ్యాపకులు తమ దృష్టిని పూర్తిగా విద్యార్థులపై కేంద్రీకరించడానికి అవకా శం ఉంటుంది. అంటే వారు విద్యార్థులకు మరింత సమయం కేటాయించవచ్చు. దీనివల్ల ఏ విద్యార్థి వెనుకబడిపోకుండా చూసుకోవచ్చు. విద్యార్థుల నేర్చుకునే విధానాలను విశ్లేషించడం ద్వారా, 'అడాప్టివ్ ఎఐ' టూల్స్ వారి ప్రత్యేక శైలికి అనుగుణంగా పాఠాలను అందిస్తాయి. టెక్స్ టు –స్పీచ్, విజువల్ రికగ్నిషన్, స్పీచ్ రికగ్నిషన్ వంటి ఎఐ సామర్థ్యాలను ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకోసం ప్రత్యేకంగా రూపొందించవచ్చు. వర్చువల్ ట్యూటర్స్ ప్రాధాన్యత మరింతగా పెరుగుతోంది. ఇవి చాట్‌బాట్‌లా కాకుండా వ్యక్తిగత గురువులా వ్యవహరిస్తాయి. అర్ధరాత్రి సందేహం వచ్చినా, టీచర్ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా ఎఐ ద్వారా వెంటనే వివరణ పొందవచ్చు. ప్రతి విద్యార్థి గ్రహణశక్తి ఒకేలా ఉండదు. ఎఐ దీనిని గుర్తించి.. పాఠం వినడంలో ఇబ్బంది పడుతుంటే, మరిన్ని ఉదాహరణలతో సులభంగా వివరిస్తుంది. పరీక్షా పత్రాల మూల్యాంకనం, హాజరు వంటి పరిపాలనా పనులను ఎఐ చూసుకుంటుంది. దీనివల్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలు, సృజనాత్మకతను నేర్పడంపై ఎక్కువ సమయం కేటాయించగలరు. ఏ విద్యార్థి పరీక్షల్లో వెనుకబడే అవకాశం ఉందో ఎఐ డేటాద్వారా ముందే గుర్తించి ఉపాధ్యాయులను హెచ్చరిస్తుంది. ఎఐ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదు. వారి సామర్థ్యాలను పెంచడానికి మాత్రం ఎంతగానో ఉపయోగపడుతుంది.

# కౌన్సిల్ సంఖ్యాబలం?
# నాయకత్వ పోరాటం


తెలంగాణ పట్టణ రాజకీయాల్లో మరో కీలక మలుపుకు నేడు తెరలేపుతోంది. వార్డు సభ్యుల ఎన్నికలతో వ్యక్తమైన ప్రజా తీర్పు ఇప్పుడు మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల రూపంలో అధికార నిర్మాణంగా మారబోతోంది. పట్టణ స్థానిక సంస్థలు కేవలం పరిపాలనా యంత్రాంగాలే కావు; ప్రజల దైనందిన జీవన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, పౌర సేవల నాణ్యత ? ఇవన్నీ ఇక్కడే నిర్ణయ మవుతాయి. అందుకే ఈ ఎన్నికలు స్థానిక రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర రాజకీయ దిశను సూచించే సూచికలుగా భావించబడు తున్నాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత దగ్గర స్థాయిలో జరిగే ఈ ప్రక్రియలో ప్రజల అభిప్రాయం, పార్టీల వ్యూహాలు, స్థానిక సామాజిక సమీకరణాలు కలిసి ఒక సమగ్ర రాజకీయ దృశ్యాన్ని సృష్టిస్తున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణ మొత్తం రాజ్యాంగబద్ధ వ్యవస్థలో భాగంగా జరుగుతోంది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను పర్యవేక్షిస్తూ నియమ నిబంధనలను అమలు చేస్తున్నది తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం. ఎన్నికల షెడ్యూల్ నుంచి ఫలితాల ధృవీకరణ వరకు ప్రతి దశలో పారదర్శకత, చట్టబద్ధతను కాపాడే బాధ్యత ఈ సంస్థపై ఉంది. వార్డు సభ్యుల ఎన్నికల అనంతరం కౌన్సిల్ ఏర్పడుతుంది. ఆ కౌన్సిల్‌లోని ఎన్నికైన సభ్యులే మేయర్ లేదా చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ విధానం ప్రత్యక్ష ప్రజా తీర్పు మరియు ప్రతినిధి ప్రజాస్వామ్యం మధ్య సమతుల్యతను సూచిస్తుంది. కొన్ని చోట్ల ఎక్స్–ఆఫిషియో సభ్యుల పాత్ర, చట్టపరమైన వివరణలు, పార్టీ విప్‌లు వంటి అంశాలు ఎన్నికల ఉత్కంఠను పెంచుతాయి. ప్రస్తుతం నిర్వహించిన పట్టణ ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా అనేక మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కవర్ చేశాయి. వేల సంఖ్యలో వార్డుల్లో జరిగిన పోటీ పట్టణ ఓటర్ల చైతన్యాన్ని ప్రతిబింబించింది. నీటి సరఫరా, పారిశుధ్యం, ట్రాఫిక్, రహదారులు, పట్టణ ప్రణాళిక, పన్నుల నిర్వహణ వంటి సమస్యలు ఎన్నికల ప్రధాన అజెండాగా నిలిచాయి. స్థానిక సమస్యలపై స్పష్టమైన హామీలు ఇచ్చిన అభ్యర్థులకు ప్రజలు ప్రాధాన్యం ఇచ్చినట్టు ఫలితాల ధోరణి సూచిస్తోంది. పట్టణ ఓటరు ఇప్పుడు అభివృద్ధి, సేవల నాణ్యత, పరిపాలనా సమర్థత ఆధారంగా నిర్ణయం తీసుకుంటున్నాడనే అభిప్రాయం బలపడుతోంది.ఫలితాల పరంగా చూస్తే పట్టణ రాజకీయాల్లో స్పష్టమైన పోటీ కనిపించింది. అధికారంలో ఉన్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అనేక పట్టణాల్లో ముందంజలో నిలవడం ద్వారా కౌన్సిళ్లలో ఆధిక్యాన్ని సంపాదించింది. రాష్ట్ర నాయకత్వం, ముఖ్యంగా రేవంత్ రెడ్డి ముందుంచిన అభివృద్ధి,



సంక్షేమ దృక్కోణం పట్టణ ఓటర్లపై ప్రభావం చూపిందనే విశ్లేషణ వినిపిస్తోంది. కౌన్సిల్‌లో స్పష్టమైన సంఖ్యాబలం ఉన్న చోట మేయర్, చైర్మన్ ఎన్నికలు సులభతరంగా జరిగే అవకాశం ఉంది. అయితే పట్టణ రాజకీయాల్లో స్థానిక నాయకత్వం, వ్యక్తిగత ప్రభావం కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ప్రధాన ప్రతిపక్షంగా నిలుస్తున్న భారత్ రాష్ట్ర సమితి అనేక పట్టణాల్లో గట్టి పోటీ ఇచ్చింది. గత పాలనలో చేపట్టిన పట్టణ మౌలిక వసతుల అభివృద్ధిని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఈ పార్టీ తన బలం నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది. కొన్ని కౌన్సిళ్లలో స్పష్టమైన మెజారిటీ దక్కకపోయినా, కీలక స్థానాల్లో ప్రభావం చూపే స్థాయిలో సభ్యత్వాన్ని సాధించింది. హంగ్ పరిస్థితుల్లో ఈ పార్టీ పాత్ర మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. స్వతంత్ర సభ్యుల మద్దతు, వ్యూహాత్మక చర్చలు, రాజకీయ సమన్వయం ? ఇవన్నీ నాయకత్వ ఎన్నికల్లో నిర్ణయాత్మకంగా మారవచ్చు. పట్టణ స్థాయిలో విస్తరణ లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ కూడా గణనీయ ప్రదర్శన కనబరిచింది. మధ్యతరగతి పట్టణ ఓటర్లను ఆకర్షించే అభివృద్ధి వాదన, స్థానిక సమస్యలపై దృష్టి ఈ పార్టీకి కొన్నిచోట్ల కీలక స్థానాలను తెచ్చిపెట్టాయి. ఇదే సమయంలో నగర ప్రాంతాల్లో ప్రభావం కలిగిన ఆల్ ఇండియా మజ్లిస్–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ తన సామాజిక ఆధారాన్ని నిలబెట్టుకుంటూ కొన్ని కౌన్సిళ్లలో ప్రభావాన్ని కొనసాగిస్తోంది. ఈ వైవిధ్యం పట్టణ రాజకీయాల బహుముఖ స్వరూపాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ ఎన్నికలలో ముఖ్యంగా గమనించాల్సిన అంశం హంగ్ కౌన్సిళ్ల పెరుగుదల. అనేక పట్టణాల్లో ఏ ఒక్క పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో స్వతంత్రులు, చిన్న పార్టీలు కీలక పాత్రలోకి వచ్చాయి.

ఇలాంటి సందర్భాల్లో రాజకీయ చర్చలు, కూటములు, వ్యూ హాత్మక మద్దతులు ప్రధానమవుతాయి. సభ్యుల నిర్ణయాలు, పార్టీ విప్‌లు, చట్టపరమైన పరిమితులు ? ఇవన్నీ కలిసి నాయకత్వ ఎన్నికల దిశను నిర్ణయిస్తాయి. ప్రజాస్వామ్యంలో చర్చా సంస్కృతి, రాజీ రాజకీయాలు ఇక్కడ స్పష్టంగా కనిపి స్తాయి. మేయర్ లేదా చైర్మన్ పదవి పట్టణ పాలనలో కేంద్ర స్థానం. పట్టణ బడ్జెట్ వినియోగం, అభివృద్ధి ప్రాధాన్యాల నిర్ణయం, పౌర సేవల సమన్వయం, పరిపాలనా పర్యవేక్షణ ? ఇవన్నీ నాయకత్వంపై ఆధారపడి ఉంటాయి. కౌన్సిల్‌తో సమన్వయం సాధించడం, అధికార యంత్రాంగంతో సమర్థంగా పని చేయడం, ప్రజా సమస్యలకు వేగంగా స్పందించడం ? ఇవి విజయవంతమైన పట్టణ పాలనకు అవసరమైన లక్షణాలు. అందువల్ల ఈ ఎన్నికలు కేవలం రాజకీయ విజయాల కొలమానం కాకుండా పట్టణ ప్రజల జీవన నాణ్యతను ప్రభావితం చేసే నిర్ణాయక దశ. పూర్వ ఎన్నికలతో పోలిస్తే పట్టణ ఓటర్ల ప్రాధాన్యతల్లో మార్పు కనిపిస్తోంది. వ్యక్తిగత సేవా చరిత్ర, స్థానిక సమస్యలపై అవగాహన, అభివృద్ధి దృక్కోణం ? ఇవి అభ్యర్థుల ఎంపికలో కీలక ప్రమాణాలుగా మారాయి. పార్టీ గుర్తింపు ఉన్నప్పటికీ, స్థానిక నాయకత్వం ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పట్టణ ప్రజాస్వామ్యంలో పరిపక్వతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు.పార్టీల వ్యూహాల పరంగా చూస్తే స్పష్టమైన సంఖ్యాబలం ఉన్న చోట నాయకత్వ ఎన్నికలు సులభంగా జరిగే అవకాశం ఉంది. హంగ్ పరిస్థితుల్లో మాత్రం చర్చలు, మద్దతు సమీకరణాలు కీలకం. ప్రతి పార్టీ తనకు అనుకూలమైన కూటమి నిర్మాణానికి ప్రయత్నిస్తోంది. స్వతంత్ర సభ్యుల ప్రాధాన్యం పెరగడంతో రాజకీయ చాతుర్యం పరీక్షకు లోనవుతోంది. ఈ ప్రక్రియ మొత్తం పట్టణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. మొత్తం మీద ఈ పట్టణ ఎన్నికలు తెలంగాణ రాజకీయ దిశను ప్రతిబింబిస్తున్నాయి. ప్రజా తీర్పు ఆధారంగా ఏర్పడే కౌన్సిళ్లు, వాటి నుంచి ఎన్నికయ్యే నాయకత్వం పట్టణాభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించే సామర్థ్యం కలిగి ఉంది. పారదర్శక పరిపాలన, సమర్థ సేవల అమలు, ప్రజల భాగస్వామ్యం ? ఇవే విజయవంతమైన పట్టణ పాలనకు మూల స్తంభాలు. నేడు జరుగుతున్న మేయర్, చైర్మన్ ఎన్నికలు ఆ దిశగా కీలక అడుగు. పట్టణ ప్రజాస్వామ్యం బలపడితేనే రాష్ట్ర అభివృద్ధి స్థిరంగా ముందుకు సాగుతుంది. తెలంగాణ పట్టణ రాజకీయాల్లో ఈ ఎన్నికలు ఒక కీలక మైలురాయిగా నిలిచి, భవిష్యత్ పాలనా రూపురేఖలను నిర్దేశించనున్నాయి.

# అరటిపండ్లు లేదా ఖర్జూరా.. మార్నింగ్ తినేందుకు ఏది బెస్ట్!

మార్నింగ్ మనం తినే ఆహారం అనేది మన దే మొత్తంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. కాబట్టి మనం మార్నింగ్ తినే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం చాలా అవసరం. ఈ మధ్య కాలంలో చాలా మంది మార్నింగ్ లేచిన వెంటనే టీ, కాఫీ వంటివి తీసుకోవడం మనం గమనించవచ్చు. కానీ నిపుణులు మాత్రం ఆరోగ్యానికి అనుకూలంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో అరటి పండు, ఖర్జూరం రెండూ ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయని చెబుతున్నారు. సరైన ఆహారంతో మన దేను ప్రారంభించడం వల్ల మన జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఇది మన మొత్తం ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యం మార్నింగ్ పండ్లను తినడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రతి పండు ప్రత్యేకమైనదే.. వీటిని ఖాళీ కడుపుతో తిన్నప్పుడు ఒక్కొటి ఒక్కొరకమైన ప్రయోజనాలను అందిస్తాయి. సాధారణంగా జనాలు ఎక్కువగా తీసుకునే అరటి పండు, లేదా ఖర్జూరా పండ్ల విషయానికి వస్తే ఈ రెండు కూడా వేర్వేరు పోషక ప్రొఫైల్‌లను అందిస్తాయి. కాబట్టి ఏ పండు వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి, మార్నింగ్ తినేందుకు రెండింటిలో ఏద ఉత్తమమైనదో చూద్దాం.

అరటిపండ్లలో పొటాషియం, మెగ్నీషియం, సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి. ఇది తక్షణ శక్తిని అందిస్తుంది. అయితే, ఖాళీ కడుపుతో అరటిపండ్లు తినడం ప్రయోజనకరంగా ఉండకపోవచ్చు. దీనిలో పొటాషియం పుష్కలంగా ఉండటం వల్ల అవి గుండె, కండరాల పనితీరుకు ప్రయోజనకరంగా ఉంటాయి, ఇది చాలా మందికి సులభంగా జీర్ణం అవుతుంది. అయితే దీన్ని తినడం వల్ల కూడా కొన్ని దుష్ప్రభావాలు ఉంటాయి. ఇది శరీంలోని మెగ్నీషియం సమతుల్యతను దెబ్బతీయ వచ్చు.అలాగే సహజ చక్కెరలు శక్తిలో అకస్మాత్తుగా పెరుగుదలకు కారణమవుతాయి, ఆ తర్వాత అకస్మాత్తుగా తగ్గుతాయి. సున్నితమైన వ్యక్తులలో, ఇది ఆమ్లత్వం లేదా ఉబ్బరాన్ని కలిగిస్తుంది. కాబట్టి ఇది అందిరికి ఒకే రకమైన ప్రయోజనాలను అందించలేదు.

ఖర్జూరాలు ఖాళీ కడుపుతో తినడానికి అత్యంత ప్రయోజనకరమైన పండ్లలో ఒకటిగా పరిగణించబడతాయి, ముఖ్యంగా సాంప్రదాయ, ఆయుర్వేద పద్ధతులలో వీటిని తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది, అలాగే మలబద్ధకాన్ని నివారిస్తుంది. అలాగే ఆమ్లత ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఖర్జూరాలు పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, జీవక్రియను పెంచుతాయి. వాటిలో ఇనుము, యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి, ఇవి ఉదయం అలసట లేదా శక్తి లేకపోవడం అనుభవించే వారికి ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, 2-3 ఖర్జూర పండ్లను రాత్రిపూట నీటిలో నానబెట్టి ఉదయం తినడం వల్ల జీర్ణక్రియ బాగా జరిగి పోషకాలు గ్రహించబడతాయి. చాలా మందికి, ఖాళీ కడుపుతో ఖర్జూరాలు తినడం ఆరోగ్యకరమైన ఎంపిక కావచ్చు. ఎందుకంటే అవి జీర్ణక్రియకు సహాయపడతాయి అలాగే దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి. అరటిపండ్లు పోషకమైనవి, కానీ జీర్ణ సమస్యలను నివారించడానికి వాటిని తరువాత లేదా ఇతర ఆహారాలతో కలిపి తినడం మంచిది. అయితే, మధుమేహ వ్యాధిగ్రస్తులు తాము తీసుకునే పండ్లు, కూరగాయల పరిమాణాన్ని పర్యవేక్షించాలి. ఆమ్లత్వం లేదా ఉబ్బరం ఉన్నవారు అరటిపండ్ల కంటే ఖర్జూరం జీర్ణం కావడానికి సులభం అని భావిస్తారు. అరటిపండ్లు, ఖర్జూరాలు రెండూ ఆరోగ్యకరమైన పండ్లు, కానీ వాటిని తీసుకునే సమయం వేటితో కలిపి తింటున్నామనేది ముఖ్యం. ఖర్జూరాలు సాధారణంగా ఖాళీ కడుపుతో తింటే పోషకమైనవి, కానీ ఉదయం అరటిపండ్లను ఇతర ఆహారలో పార్టు తీసుకోవడం ఉత్తమం.

# ఈ గింజలు వదలకుండా తినేయండి..!



జాక్ ఫ్రూట్ గింజలు ఫైబర్ తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల మీరు ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగి ఉంటారు. అతిగా తినకుండా ఉండటానికి సహాయపడుతుంది. పనస గింజల్లో ఇనుము పుష్కలంగా ఉంటుంది. ఇది మన శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తిని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు కూడా సహాయపడుతుంది. దీన్ని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చు. పనస గింజలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది కాబట్టి, తరచుగా మలబద్ధకంతో బాధపడేవారు వీటిని తినాలి. అలాగే, జీర్ణ సమస్యలు ఉన్న వారికి కూడా పనస గింజలు ఎంతో మంచిదని చెబుతున్నారు. పనస గింజలను పొడి చేసుకుని తీసుకుంటే జీర్ణ సమస్యలు ముఖ్యంగా గ్యాస్, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు దూరం అవుతాయని సూచిస్తున్నారు. అలాగే, విటమిన్ ఎ పనస గింజల్లో పుష్కలంగా లభ్యమవుతుంది. విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి ముఖ్యమైన పోషకాలలో ఒకటన్న సంగతి తెలిసిందే. కాబట్టి, పనస గింజలను ఉడకబెట్టి లేదా వేరే విధంగా కూడా తీసుకోవచ్చు. దాంతో కంటి ఆరోగ్యం పెరుగుపడుతుంది. అదేవిధంగా పనస గింజల్లో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు కూడా పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఎముకులను, దంతాలను దృఢంగా మారుస్తాయి. గుండె పోటు, ఇతర గుండె జబ్బులు రాకుండా రక్షిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మీరు పనస గింజలను వేయించి తినవచ్చు. వాటిని ఒక పాన్ మీద 15-20 నిమిషాలు వేయించాలి. అవి కొద్దిగా గోధుమ రంగులోకి మారిన తర్వాత, వాటిపై కొంచెం నల్ల ఉప్పు, చాట్ మసాలా చల్లి తినండి. పనస గింజలను ఎండలో ఎండబెట్టి పొడి చేసి, సలాడ్లు లేదా పండ్లపై చల్లి తినవచ్చు. మీకు ఇష్టమైన పండ్లతో పాటు పనస గింజల సహాయంతో మీరు స్మూతీలను కూడా తయారు చేసుకోవచ్చు.

# రోగాలను నయం చేసే శక్తి దీనికి ఉంది!



అతిబల మొక్క, భారతీయ సంప్రదాయ వైద్యంలో శతాబ్దాలుగా ఉపయోగించబడుతోంది. ఇది యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలతో జ్వరం, దగ్గు, కీళ్లనొప్పులు, కిడ్నీలో రాళ్లు, మూత్రనాళ వ్యాధులు, నడుము నొప్పి వంటి 100కు పైగా రోగాలను నయం చేయగలదని ఆయుర్వేదం చెబుతుంది. మన చుట్టూ ఉండే ఎన్నో మొక్కలు అలివికాని మొండి రోగాలను సైతం నయం చేయగలవని చాలామందికి తెలియదు. అలాంటి అద్భుత ఔషధ గుణాలు కలిగిన మొక్కల్లో అతిబల ఒకటి. దీనిని దువ్వెన బెండ, ముద్ర బెండ, తుత్తురు బెండ అని కూడా పిలుస్తారు. ఈ మొక్క మాల్వేసి కుటుంబానికి చెందినది. రోడ్ల పక్కన, పొలాల కంచెల వెంట విస్తారంగా కనిపించే ఈ మొక్కలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలు చాలామందికి తెలియదు. అతిబల మొక్క యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ధర్మాలను కలిగి ఉంటుంది. భారతీయ సంప్రదాయ వైద్యంలో, ముఖ్యంగా తమిళ సిద్ధ వైద్యంలో, భారతీయ ఆయుర్వేదంలో దీనిలోని ప్రతి భాగాన్ని వివిధ వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. ఈ మొక్క జ్వరం, దగ్గు, ఊపిరితిత్తుల వ్యాధులు, మూత్రనాళ వ్యాధులు, కిడ్నీలో రాళ్లు కరిగించడానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కీళ్లనొప్పి లేదా కీళ్లవాతం ఉన్నప్పుడు అతిబల ఆకుల పేస్ట్‌కు ఆవాల నూనె కలిపి రాయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. రక్త మొలలు ఉన్నవారు ఆకులను ఉడికించి తింటే తగ్గుతాయని చెబుతారు. ఆడవారిలో యోని ఇన్ఫెక్షన్లు ఉంటే, దీని ఆకుల డికాక్షన్‌తో శుభ్రం చేసుకోవచ్చు. చర్మంపై వాపులు, గాయాలు, పుండ్లు ఉన్నప్పుడు అతిబల ఆకులను పసుపుతో కలిపి పేస్ట్‌గా చేసి రాయడం వల్ల త్వరగా నయం అవుతాయి, ఎందుకంటే ఆకులకు యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. మూత్రంలో మంట, మూత్రాశయంలో రాళ్లు ఉన్నవారు అతిబల ఆకులను నీటిలో మరిగించి తేనె కలిపి త్రాగడం వల్ల రాళ్లు కరిగి, మంట తగ్గుతుంది. అతిసారం ఉన్నవారికి దీని విత్తనాల పొడితో చేసిన టీ ఔషధంలా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుపరచడానికి అతిబల ఆకుల డికాక్షన్‌తో కళ్ళు కడుక్కుంటే మంచిది. ఊపిరితిత్తుల వ్యాధులు, క్షయ, శ్వాసనాళ వాపులకు దీని మొత్తం మొక్క భాగాన్ని (పూలు, కాండం, ఆకులు, కాయలు, వేర్లు) ఉపయోగించి కషాయం కాచి తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. జ్వరం తగ్గడానికి అతిబల ఆకులను నానబెట్టి, ఆ నీటికి పటికబెల్లం కలిపి త్రాగుతారు. దంతాల ఆరోగ్యం కోసం దీని ఆకుల రసాన్ని నోటిలో ఉంచుకొని ఊసేయడం, డికాక్షన్‌తో పుక్కిలించడం వల్ల దంతాలు గట్టిపడి పంటినొప్పి తగ్గుతుంది. నడుము నొప్పి తగ్గడానికి అతిబల ఆకుల కషాయం త్రాగాలి. గౌట్, క్షయ, నోటిపూత, పేగుపూత, రక్తస్రావాలకు కూడా దీని డికాక్షన్ ఉపయోగిస్తారు. శరీరానికి బలం రావాలంటే, అతిబల మొక్క వేరును ఆవుపాలతో మరిగించి పటికబెల్లం కలిపి తీసుకోవాలని ఆయుర్వేద గ్రంథాలు సూచిస్తున్నాయి. మూత్రంలో రక్తం పడటం, మూత్రనాళంలో మంట తగ్గడానికి దీని ఆకుల రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటారు. అతిబల ఆకుల రసాన్ని చక్కెరతో కలిపి త్రాగితే గుండె ఆరోగ్యానికి మంచిది. మగవారిలో శీఘ్రస్కలనం సమస్యకు, యూరినరీ ఇన్ఫెక్షన్లకు దీని వేరు కషాయం ఔషధంగా పనిచేస్తుంది. అతిబల మొక్క రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించి షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. ఈ మొక్క ఆకులు రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

# రోజంతా గోరువెచ్చని నీరు తాగితే ఏమవుతుంది?



మన శరీరంలో 70 శాతం నీరే ఉంటుంది. అయితే ఆధునిక జీవనశైలిలో మనం రకరకాల డ్రింక్స్‌కు అలవాటు పడి, ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన నీటిని ఎలా తాగాలో మర్చిపోతున్నాం. ముఖ్యంగా ఉదయాన్నే నిద్రలేవగానే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరానికి ప్రయోజనాలు ఉన్నాయా..?ఇది అందరికీ మంచిదేనా? నీరు శరీర దాహాన్ని తీర్చడమే కాకుండా రక్తంలో కలిసిపోయి ప్రతి కణానికి ఆక్సిజన్‌ను సరఫరా చేసే జీవనాధారం. మానవ శరీరం 70 శాతం నీటితోనే నిర్మితమై ఉంటుంది. అయితే ఏ రకమైన నీరు ఎప్పుడు తాగాలి అనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. మన పూర్వీకుల నుండి వస్తున్న ఉదయం గోరువెచ్చని నీరు తాగే అలవాటు కేవలం సంప్రదాయం మాత్రమే కాదు అదొక అద్భుతమైన ఆరోగ్య ప్రక్రియ అని ఆయుర్వేదం చెబుతోంది.ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణ అగ్ని యాక్టివేట్ అవుతుంది. ఇది శరీరంలోని కఫ దోషాన్ని సమతుల్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.జీర్ణక్రియ మెరుగు: తిన్న ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం సమస్యను వదిలించడానికి ఇది చక్కటి పరిష్కారం.టాక్సిన్స్ తొలగింపు: శరీరం లోపల పేరుకుపోయిన హానికరమైన విష పదార్థాలను బయటకు పంపి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది.బరువు తగ్గడం: క్రమం తప్పకుండా వేడి నీటిని తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరిగి, కొవ్వు కరగడానికి సహాయపడుతుంది.శ్వాసకోశ సమస్యలకు చెక్: గొంతులో పేరుకుపోయిన కఫాన్ని వదులు చేసి, దగ్గు, జలుబు నుండి ఉపశమనాన్ని ఇస్తుంది.ఉదయం ఖాళీ కడుపుతో: బాడీని రీఛార్జ్ చేయడానికి, జీర్ణక్రియను వేగవంతం చేయడానికి ఇది బెస్ట్ టైమ్.భోజనానికి 30 నిమిషాల ముందు: ఇది ఆకలిని నియంత్రించి, బరువు తగ్గాలనుకునే వారికి ఉపయోగపడుతుంది.భోజనం చేసిన గంట తర్వాత: తిన్న ఆహారం మెత్తగా మారి, పోషకాలు ఒంటికి పట్టడానికి ఇది సహాయపడుతుంది.గోరువెచ్చని నీరు ఆరోగ్యానికి మంచిదే అయినా, ఈ కింది సందర్భాల్లో తాగడం ప్రమాదకరమని ఆయుర్వేదం హెచ్చరిస్తోంది..తీవ్రమైన వేసవిలో: ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు వేడి నీరు తాగడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరిగి అసౌకర్యం కలుగుతుంది.పిత్త సమస్యలు ఉన్నప్పుడు: కడుపులో మంట లేదా అసిడిటీతో బాధపడేవారు వేడి నీటికి దూరంగా ఉండాలి. అధిక దాహం: విపరీతమైన డీహైడ్రేషన్ ఉన్నప్పుడు గోరువెచ్చని నీరు తాగితే శరీరంలోని తేమ మరింత తగ్గే అవకాశం ఉంది.

## సీఎం గారూ.... మీరు మొదలుపెట్టిన ఆటకు

# నేను ముగింపునిస్తా





బీఆర్ఎస్, ఎంఐఎంతో కలిసి సీఎం, మంత్రులు చేసిన కుట్రలన్నీ తెలుసు

కంటికి కన్పించిన కుట్రలెన్నో చేశారు...

బండి సంజయ్ రాజకీయం ముందు, బీజేపీ సైనికుల ఎదుట వాళ్ల కుట్రలు పటా పంచలైనయ్

కొంతమంది చిటెకెలు వేసి ఇది రాజకీయం అని హేళన చేశారు...చివరకు ఏమైంది?

చివరకు మీరు (సీఎం) సాధించిందేమిటి?

మీ మధ్య జరిగిన చీకటి ఒప్పందాలేమిటి?

రేవంత్ రెడ్డి....6 గ్యారంటీల అమలుపై ఇక రిక్వెస్టుల్లేవ్...

మీ మెడలు వంచేదాకా పోరాడుతూనే ఉంటాంక

రీంనగర్ వేదికగా బండి సంజయ్, బీజేపీ సైనికుల దమ్ము ఏందో చూపిస్తాం

**కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల కబడ్డీ ఆటలో... మీ అందరినీ ఓడించి బీజేపీ కప్ గెలుకుంది. ఈ వేదికగా ఇప్పుడు చెబుతున్నా... మీరు అనవసరంగా, అప్రజాస్వామికంగా నన్ను కెలికి ఆట మొదలుపెట్టారు. ఇక మీ ఆటకు నేను ముగింపు ఇస్తా"అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డికి అల్టిమేటం ఇచ్చారు. ఈరోజు కరీంనగర్ లో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం... నూతనంగా ఎన్నికైన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కార్పొరేటర్లతో కలిసి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డితోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు.
.కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటి కావడానికి కారణమేంటి? ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఫాంహౌజ్ వేదికగా కుట్రలు ఎందుకు చేశారు? ఎవరిపై మీ కోపం? కాంగ్రెస్ గెలిచింది 14 సీట్లు, ఎంఐఎం గెలిచింది 3 సీట్లు, బీఆర్ఎస్ గెలిచింది 9 సీట్లు... అన్నీ కలుపుకున్నా 26 సీట్లు మాత్రమే. మ్యాజిక్ ఫిగర్ దాటనే లేదు. ఇవన్నీ తెలిసి ఎందుకు బీజేపీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మీ చీకటి ఒప్పందాలేమిటి? మేయర్, డిప్యూటీ మేయర్ లకు అభినందనలు తెలియజేస్తున్న. కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండాను ఎగరేయాలని ఎన్నో ఏళ్లుగా కల కన్నం. ప్రజలంతా ఎదురు చూశారు. ఆ కల సాకారమైన ఈరోజు చాలా సంతోషంగా ఉంది.నిన్న క్రికెట్ లో పాకిస్తాన్ పై భారత్ ఘన విజయం సాధించింది. కరీంనగర్ గడ్డపై జరిగిన ఈ మున్సిపల్ కబడ్డీ ఆటలో ఇతర పార్టీలన్న కుట్రలు చేసినా బీజేపీ మేయర్ కప్ గెలుచుకుంది. బీజేపీని ఓడించేందుకు చెప్పలేని, కంటికి కన్పించని కుట్రలెన్నో జరిగాయి. అధికారం చేతిలో ఉంది కదా అని... బీజేపీ 30 సీట్లు సాధించినా, ఇండిపెండెంట్లు మావైపు ఉన్నా... మమ్ముల్ని ఓడించేందుకు కుట్రలు జరిగాయి.రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలుకుని మంత్రులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ కలిసి రెండ్రోజులుగా జరుగుతున్న కుట్రలను చూసి ప్రజలే విస్తుపోయారు. ఇన్ని కుట్రలు, కుతంత్రాలు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలనుకుంటున్నారా? అంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ జరిగింది. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలన్నా, తెలంగాణ వచ్చినా కరీంనగర్ వేదికగా మార్పు మొదలైన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే కరీంనగర్ మేయర్ పదవిని బీజేపీ కైవసం చేసుకుంటే రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమనే భయంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ ఒక్కటై కుట్ర చేశాయి.
కానీ మేం ప్రజల సహకారం, అమ్మవారి ఆశీస్సులతో ఆ కుట్రలన్నీ భగ్నం చేశాం.2005లా ఇదే రోజున నేను కార్పొరేటర్ గా తొలిసారి ఎన్నికైనప్పుడు ఎంతో సంతోషపడ్డా. మళ్లీ ఈరోజు ఇదే కార్పొరేషన్ పై మేయర్ పీఠాన్ని బీజేపీని దక్కించుకున్నందుకు అంతకంటే ఎక్కువ సంతోషంగా ఉంది. మేయర్ గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉంది. మా మేయర్, డిప్యూటీ మేయర్ కార్పొరేటర్లు గుణవంతులు, నీతిమంతులు... అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేస్తారు. కార్పొరేషన్ లో అవినీతికి తావు లేకుండా ప్రజలకు అండగా ఉంటూ కరీంనగర్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం. ఎన్నికల వరకే రాజకీయాలు. ఎన్నికల తరువాత అభివృద్ధే మా లక్ష్యం. ఇందుకోసం అన్ని పార్టీలు కలిసి రావాలని కోరుతున్నా. కరీంనగర్ అభివృద్ధి విషయంలో ప్రజలు లేటైనా లేటెస్టుగా తీర్పునిచ్చారు. అధిక మెజారిటీని ఇచ్చి ఆశీర్వదించారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, అమిత్ షాను కలిసి కరీంనగర్ కు అత్యధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేసేందుకు యత్నిస్తా.బాధాకరమైన విషయం ఏంటంటే... బీజేపీకి మేయర్ పదవి రాకుండా ఉండేందుకు జరిగిన కుట్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా భాగస్వాములు కావడం ఆశ్చర్యం కలిగించింది. గత రెండ్రోజులుగా అనేక కుట్రలు చేశారు. ఇబ్బంది పెట్టారు. నేను నమ్ముకున్న అమ్మవారి ఆశీస్సులు, ఎములాడ రాజన్న, కొండగట్టు అంజన్న, పాతబస్తీ భాగ్యలక్ష్మి అమ్మవార్ల దీవెనలతో వాటిని అధిగమించినం.నేనడుగుతున్నా... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటి కావడానికి కారణమేంటి? ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఫాంహౌజ్ వేదికగా కుట్రలు ఎందుకు చేశారు? ఎవరిపై మీ కోపం? కాంగ్రెస్ గెలిచింది 14 సీట్లు, ఎంఐఎం గెలిచింది 3 సీట్లు, బీఆర్ఎస్ గెలిచింది 9 సీట్లు... అన్నీ కలుపుకున్నా 26 సీట్లు మాత్రమే. మ్యాజిక్ ఫిగర్ దాటనే లేదు. ఇవన్నీ తెలిసి ఎందుకు బీజేపీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మీ చీకటి ఒప్పందాలేమిటి? మున్సిపల్ ఎన్నికలకు ముందు వాళ్లు (కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం) ఆట స్టార్ట్ చేశారు. బీజేపీ ఆ ఆటకు ముగింపు ఇవ్వబోతున్నా.
ముఖ్యంగా కాంగ్రెస్ కు ఛాలెంజ్ విసురుతున్నా... ఎక్కడికక్కడ 6 గ్యారంటీలను అమలు చేసేదాకా మీ మెడలు వంచుతాం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పతనానికి ముగింపు పలుకుతాం. అందుకు కరీంనగరే వేదిక కాబోతోంది. గత రెండ్రోజులుగా కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుట్రలను చూసి మేం భయపడలే. కనీస వ్యూహం, ఎత్తుగడలకు లేకుండా వ్యవహరించిన తీరును చూసి మేమంతా నవ్వుకున్నాం. ఈ విషయంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల పంథాను చూసి అభినందించకుండా ఉండలేకపోతున్నా. ప్రజాస్వామ్య తీర్పును శిరసావహించాలనే ఉద్దేశంతో పార్టీ నిర్ణయానికి భిన్నంగా వ్యవహరించిన తీరు గొప్ప విషయం.ఒక్క బండి సంజయ్ ను అడ్డుకోవడానికి, బీజేపీ సైనికులను అడ్డుకోవడానికి హైదరాబాద్ శివారులోని లియోనియో రిసార్ట్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం చేయని కుట్రలు లేవు. అయినా ఏం సాధించారు? ఒక్క బండి సంజయ్ ను అడ్డుకోలేకపోయారు? బీజేపీ సైనికులను అడ్డుకోలేకపోయారు? కాంగ్రెస్ మేయర్ ఎన్నికలో ఎలాంటి కుట్ర లేదని, కాంగ్రెస్ కు సంబంధం లేదని ముఖ్యమంత్రి చెప్పే దుమ్ముందా? మీ కుట్ర ఉందని నేను నిరూపిస్తా.కరీంనగర్ మేయర్ ఎన్నిక విషయాం పూర్తిగా సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ విషయంలో ఆయన చేయని సాయం లేదు. హ్యాట్సాఫ్... జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ఫోన్ చేసి ఎప్పటికప్పుడు సహకరించారు. వారికి ధన్యవాదాలు. కరీంనగర్ గెలుపుకు ప్రధాన కారణం నరేంద్రమోదీ ఇచ్చిన నిధులు, చేసిన అభివృద్ధే కారణం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహకారం మరువలేనిది. వీరితోపాటు కిషన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, డీకే అరుణసహా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు ఎంతో సహకారం అందించారు. ముఖ్యంగా ఇతర జిల్లాల నుండి బీజేపీ కార్యకర్తలు వచ్చి కరీంనగర్ లో బీజేపీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన తీరు అభినందనీయం.

# కాంగ్రెస్‌కు గూడెం మహిపాల్ రెడ్డి గట్టి షాక్

**హైదరాబాద్ :** పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌కు గట్టి షాక్ ఇచ్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆయన బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశారు. ముఖ్యంగా ఇస్నాపూర్‌లో తన ఎక్స్ అఫీషియో ఓటుతో బీఆర్ఎస్ చైర్మన్‌ను గెలిపించుకున్న అనంతరం, తనదైన శైలిలో బుల్లెట్ దిగిందా లేదా? అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్ తరపున మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ అభివృద్ధి పేరుతో 2024 జూలైలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ సమయంలో ఆయనపై ఈడీ దాడులు జరిగాయి. పలు రకాల సమస్యలు రావడంతో ఆయన పార్టీ మారారు. మొదట్లో బీజేపీలో చేరుతారన్న ప్రచారం జరిగినా చివరికి కాంగ్రెస్ లోనే చేరారు. అయితే కాంగ్రెస్‌లో చేరి తాను పెద్ద తప్పటడుగు వేశానని, ఆ పార్టీ వల్ల తనకు లేదా నియోజకవర్గానికి వెంట్రుక వాసి కూడా ప్రయోజనం కలగలేదని



సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు గుర్తింపునిచ్చింది గులాబీ జెండానేనని ఆయన బహిరంగంగానే ప్రకటించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించడానికి ఆయన ప్రచారం చేశారు.. పని చేశారు కానీ.. ఆ పార్టీలో మళ్లీ అధికారికంగా చేరలేదు. మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడాన్ని మొదటి నుంచి స్థానిక కాంగ్రెస్ సీనియర్ నేతలు కాటా శ్రీనివాస్ గౌడ్, నీలం మధు ముదిరాజ్ మొదటి నుంచీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి, అక్కడ సీఎం రేవంత్ రెడ్డి ఫోటో లేదని రగడ చేయడం వంటి ఘటనలు ఆయనపై ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేశాయి. ఈ వర్గపోరు కారణంగానే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో ఇమడలేక తిరిగి బీఆర్ఎస్ బాట పట్టారు. మహిపాల్ రెడ్డి సోదరుడు ఇప్పటికే బీఆర్ఎస్‌లో చేరడం, స్వయంగా ఎమ్మెల్యేనే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునివ్వడం వంటి పరిణామాలు ఆయన పునరాగమనాన్ని సూచిస్తున్నాయి. అయితే, మున్సిపాలిటీల్లో పార్టీని గెలిపించినప్పటికీ, ఆయనను మళ్లీ అధికారికంగా చేర్చుకునే విషయంలో బీఆర్ఎస్ అధిష్టానం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. పార్టీ కేడర్ సెంటిమెంట్‌ను దృష్టిలో ఉంచుకుని వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది. ప్రస్తుతం పటాన్ చెరు నియోజకవర్గానికి ఆదర్శ్ రెడ్డిని ఇంచార్జ్ గా నియమించారు. ఇటీవలి కాలంలో ఆయనే పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ మహిపాల్ రెడ్డిని చేర్చుకుంటే ఆయన అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉంది

# 3 పార్టీలు కలిసి బీజేపీని ఓడించారు

**నిజామాబాద్ :** నిజామాబాద్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అనైతిక పొత్తు పెట్టుకున్నాయని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ మూడు పార్టీలు కలిసి బీజేపీని ఓడించి కార్పొరేషన్ ను కైవసం చేసుకున్నాయని మండిపడ్డారు. స్వల్ప మెజార్టీతో తాము మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కోల్పోయామని చెప్పారు. ఈ మేయర్, డిప్యూటీ మేయర్ టర్మ్ పూర్తి కాకముందే మేయర్ పీఠాన్ని బీజేపీ ఎక్కుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు."ఇది నా మాటగా చెబుతున్నాను. మేయర్, డిప్యూటీ మేయర్ టర్మ్ ముగిసేలోపు సీన్ రివర్స్ చేసి చూపిస్తాం" అని అర్వింద్ అన్నారు. ఇక్కడికి అక్బరుద్దీన్ ఒవైసీ వచ్చి హిందువులను దూషించినా... ఆత్మాభిమానాన్ని చంపుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంతో కలిసిపోయాయని తీవ్ర విమర్శలు చేశారు.కాళేశ్వరం, కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కల్వకుంట్ల కుటుంబాన్ని రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ఈ పొత్తుల వెనుక ఆ రహస్యాలు దాగున్నాయని ఆరోపించారుపోలీసులు కూడా రాజకీయ రంగుపులుముకుని బీఆర్ఎస్ కార్పొరేటర్‌ను ఎత్తుకెళ్లి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేలా చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. కరీంనగర్‌లో మేయర్ ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్... నిజామాబాద్‌లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "కరీంనగర్ మీదనే ఎందుకు ప్రేమ? నిజామాబాద్ మీద ఎందుకు లేదు?" అని ప్రశ్నించారు.

## చౌదారం, గుండారం గుట్టల ప్రాంతంలో పులి సంచారం

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**సిద్దిపేట :** చిన్నకోడూరు మండలం చౌదారం మరియు గుండారం గుట్టల పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో, సిద్దిపేట రూరల్ సిఐ. శ్రీను, చిన్నకోడూరు ఎస్ఐ. చంద్రమోహన్ తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు అటవీ శాఖ అధికారులు మరియు పూణే నుండి వచ్చిన ప్రత్యేక రెస్క్యూ టీమ్ సభ్యులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. పులి కదలికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా చౌదారం మరియు గుండారం వైపు నుండి అటవీ ప్రాంతంలోకి వెళ్లే రెండు ప్రధాన మార్గాలను మూసివేయడమైనది. సామాన్య ప్రజలు, గొర్రెల కాపరులు అడవిలోకి వెళ్లకూడదని సిఐ శ్రీను తెలిపారు. శుక్రవారం రోజున ఒక దూడను చెట్టుకు కట్టేసిన ప్రాంతంలో పులి సంచరించినట్లు అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం రెస్క్యూ టీమ్ పులిని పట్టుకునే ప్రయత్నాల్లో ఉందని,ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతాలకు లేదా పొలాలకు వెళ్లవద్దని సూచించారు.చౌదారం, విఠలాపూర్, గంగాపూర్, మాచాపూర్, కిష్టాపూర్, మల్లారం, అనంతసాగర్, రంగాయపల్లి, ఎల్లాయిపల్లి, కమ్మర్లపల్లి, మైలారం, అల్లిపూర్ మరియు గుండారం గ్రామాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సిఐ శ్రీను కోరారు.వన్యప్రాణి సంరక్షణ మరియు ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ పోలీసు మరియు అటవీ శాఖ అధికారులకు సహకరించాలని సిఐ. శ్రీను విజ్ఞప్తి చేశారు.

## అగ్నిలో ఆహుతి అయిన ఇల్లు.. రోడ్డున పడిన పేద కుటుంబం

ఎవరైనా సహాయం చేస్తారా అని ఎదురుచూపు

ఇన్నేళ్ల నుండి సంపాదించుకున్నదంతా అగ్నిలో కాలిపోతే కట్టు బట్టలతో బయటపడిన కుటుంబం

ఇంత నష్టం జరిగినా ప్రభుత్వం స్పందించక నాయకులు స్పందించకపోవడంతో బిక్కు బిక్కు మంటున్న దళిత కుటుంబం



**దేవనకొండ :** మండల పరిధిలో కరివేముల గ్రామంలో మాదిగ రంగనాయకులు తనకున్న సొంత స్థలంలో కొన్ని సంవత్సరాల నుండి గుడిసె వేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆ క్రమంలో ఆదివారం అందరూ పనులకు వెళ్లిన సమయంలో రంగనాయకులు తల్లి గంగమ్మ ఇంట్లోనే ఉండి టీ కాచుకుందామని గ్యాస్ వెలిగించింది. గ్యాస్ లీకేజ్ వల్ల మంటలు చెలరేగడంతో ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి బయటకు పరిగెత్తుకొచ్చింది అంతులోపే గుడిసె మొత్తం కూడా అగ్నిలో ఆహుతి అయిపోయింది. చుట్టుపక్కల ఉన్నవారు ఫైర్ ఇంజన్ కు ఫోన్ చేయగా అది వచ్చేలోపే గుడిసె పూర్తిగా దగ్ధమై బూడిదైపోయింది. ఏం చేయాలో తెలియక తల్లి నోరు కొట్టుకుంటూ రోదించింది. కుటుంబ యజమాని రంగనాయకులు మీడియాతో మాట్లాడుతూ.. తమ్ముడు పెళ్లి కోసం అని రెండు లక్షలు రూపాయలు నగదు అప్పుగా తీసుకొచ్చి ఇంట్లో పెట్టమని అలాగే తన తల్లి తన భార్యది మూడు తులాలు బంగారం, 20 తులాల వెండి, అగ్నిలో ఆహుతి అయిపోయిందని ఆహార ధాన్యాలు, వంట పరికరాలు, కట్టుకునే బట్టలు, దుప్పట్లు తన భార్యది కుట్టు మిషన్, పూర్తిగా కాలిపోయావని విలవిల కన్నీరు వీడుస్తూ బాధపడ్డాడు. ఉండడానికి ఇల్లు లేక కట్టుకోవడానికి బట్టలు లేక తినడానికి ఆహారం లేక చాలా ఇబ్బంది పడుతున్నామని మా మీద దయవుంచి ప్రభుత్వం సహాయం చేయాలని అలాగే నాయకులు, మానవతావాదులు, కులాలకు మతాలకు అతీతంగా వచ్చి సహాయం చేయాలని కోరాడు.

## పంట కోత ప్రయోగం


**రుద్రవరం :** మండలంలోని చిలకలూరు గ్రామంలో పంట ప్రయోగం కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి సుమతి తెలిపారు. సోమవారం వ్యవసాయ అధికారి సుమతిఆధ్వర్యంలో శనగ పంటలో 5x5 మీటర్లు విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారి మాట్లాడుతు చిలకలూరు గ్రామం లో గోపాల్ రెడ్డి పొలం లో 5x5 మీటర్ల వ్యాసార్థం లో పంట కోత ప్రయోగం చేయగా 3.150 కెజిలు రావడం జరిగిందని తెలిపారు .ఈ లెక్కన ఒక ఎకరాకు సరాసరి 5 నుండి 6 క్వింటల్లా దిగుబడి వస్తుందని తెలిపారు .ఈ కార్యక్రమం లో విస్తరణ అధికారి రాజు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు మరియు రైతులు పాల్గొన్నారు.

## ప్రాణదాతలకు ఘన సన్మానం

**ఆళ్లగడ్డ :** ప్రాణాలకు తెగించి 36 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన సాహస యోధులు మెహరాజ్, సమీర్ లను ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల భాష ఘనంగా సన్మానించారు. ఈరోజు సిరివెళ్ల మండల కేంద్రంలోని సిరివెళ్ల మెట్ట వద్ద గల బహిరంగ ప్రదేశంలో ప్రజాసంఘాలు కుల సంఘాలు రాజకీయ పార్టీ నాయకులు సిరివెళ్ల మండల కేంద్రంలో గల ప్రముఖుల సమక్షంలో మెహరాజ్ సమీర్లను పూలమాలలతో ఘనంగా సన్మానించి వారు చేసిన సాహసాన్ని సభకు వివరించారు. ఈ సందర్భంగా భాష మాట్లాడుతూ ప్రమాదాలనేటివి అనుకోకుండా ఊహించకుండా హఠాత్తుగా జరుగుతాయని అయితే ఆరోజు బస్సు ప్రమాదం జరిగిన సమయంలో ఒకపక్క బస్సు తగలబెడుతూ భయత్పాతాన్ని కలిగిస్తున్న తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా యువకులు ఇరువురు బస్సు అద్దాలను పగలగొట్టి మంటలు చెలరేగుతున్నప్పటికీ 36 మంది ప్రయాణికులను కాపాడడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. అందరిలాగే వారు కూడా మాకెందుకులే అంటూ దూరం నుంచి చూస్తూ నిలబడి ఉంటే ఈరోజు 36 మంది ప్రాణాలు గాలిలో ఉండేవని తమ ప్రాణాలను సైతం లెక్కచేయక అర్థరాత్రి సమయంలో బస్సు అద్దాలను పగలగొట్టి ప్రయాణికులను కాపాడి పదిమందికి ఇరువురు యువకులు ఆదర్శంగా నిలిచారన్నారు. అయితే ప్రభుత్వం మీరు త్యాగాలను మీరు సాహసాన్ని గుర్తించలేదన్న బాధ తనకు కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 36 మంది ప్రాణాలను కాపాడిన యువకులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి మంచి అవార్డుతో పాటు రివార్డులను కూడా అందజేయాలని ప్రభుత్వాన్ని ఆయన సభాముఖంగా కోరారు. బీరువాల భాష ప్రసంగాన్ని విన్న సభలోని వారంతా ముక్తకంఠంతో భాష అభిప్రాయానీతో ఏకీభవించా రు. కార్యక్రమంలో పలువురు కుల ప్రజా రాజకీయ పార్టీల నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

## బిజినెస్

### ఏఐ లీడర్‌గా ఉండేందుకు భారత్‌కు అన్ని అర్హతలు ఉన్నాయి



పూర్తిస్థాయిలో ఏఐ లీడర్‌గా ఉండేందుకు భారత్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. మనదేశంలో గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరగానికి కొన్ని గంటల ముందు శామ్ ఆల్ట్‌మన్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. భారత్‌కు ఉన్నటెక్నాలజీ ప్రతిభ, జాతీయ వ్యూహం, టెక్నాలజీ సామర్థ్యంపై నమ్మకం ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశమైన భారత్ స్వదేశీ నైపుణ్యం ద్వారా ఏఐలో సరైన స్థాయిలో అమలు చేసేందుకు విధానపరమైన ప్రోత్సాహం కలిగి ఉంది. ముఖ్యంగా భారత ప్రభుత్వం ఇండియాఏఐ మిషన్ లక్షలాది మందికి అవసరమైన సాధనంగా మారుతోంది. కంప్యూటర్ సామర్థ్యాన్ని విస్తరించేందుకు, స్టార్టప్‌లకు మద్దతిచ్చేందుకు, హెల్త్‌కేర్, వ్యవసాయం, పబ్లిక్ సర్వీసెస్‌లో యాప్‌లను రూపొందించడంలో విజయవంతమైందని శామ్ ఆల్ట్‌మన్ వివరించారు. ఏఐ టూల్స్‌ను వేగంగా ఉపయోగించడంలో 10 కోట్లకు పైగా యాక్టివ్ యూజర్లతో అమెరికా తర్వాత రెండో స్థానంలో ఉంది. ఈ క్రమంలో భారత్ పూర్తిస్థాయి ఏఐ లీడర్‌గా ఉండటానికి అన్ని అర్హతలను కలిగి ఉంది. ఏఐ ప్రయోజనాలను విస్తరించేందుకు యాక్సెస్, అడాప్షన్, ఏజెన్సీపై పురోగతి అవసరమని శామ్ ఆల్ట్‌మన్ వెల్లడించారు.

### ఈ ఏడాది పీఎస్‌బీల లాభాలు రూ. 2 లక్షల కోట్లకు పైనే




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు(పీఎస్‌బీ) రూ. 2 లక్షల కోట్లకు పైగా రికార్డు లాభాలను సాధిస్తాయని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు విశ్వాసం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగ ఆర్థికంగా బలపడుతోందని, స్థిరమైన లాభాలను చూస్తున్నాయని ఆయన తెలిపారు. పీటీఐతో జరిగిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. బ్యాంకులు ఎక్కువ రుణాలు ఇస్తున్నాయి, డిపాజిట్లు అంతే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇది మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ సామర్థ్యం బలంగా ఉండటాన్ని సూచిస్తుంది. ఈ ఏడాది పీఎస్‌బీలో క్రెడిట్ వృద్ధి దాదాపు 12 శాతం వద్ద ఉంది. ఇదే సమయంలో డిపాజిట్ల వృద్ధి దాదాపు 10 శాతం ఉందని నాగరాజు వివరించారు. ఈ నేపథ్యంలో పీఎస్‌బీలు చారిత్రాత్మక లాభాలను చూడనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలోనే దాదాపు రూ. లక్ష కోట్లను చేరుకున్నాయి. మిగిలిన సగంలో రూ. 2 లక్షల కోట్లను దాటడం సులభమేనని ఆయన అభిప్రాయపడ్డారు. గత మూడేళ్లలో బ్యాంకింగ్ రంగం ఆదాయం భారీగా పెరిగింది. 2022-23లో పీఎస్‌బీలు రూ. లక్షల కోట్లకు పైగా లాభాలను చూశాయి. 2023-24లో రూ. 1.41 లక్షల కోట్లను, 2024-25లో రూ. 1.78 లక్షల కోట్ల లాభాలను నమోదు చేశాయని ఎం నాగరాజు పేర్కొన్నారు.

# అందరూ వాట్సాప్ స్పామ్ బాధితులే





వాట్సాప్‌లో స్పామ్ మెసేజ్‌లు, కాల్స్ బెడద ఎక్కువైపోయాయి. దీనిపై చాలామంది నుంచి ఫిర్యాదులు కూడా వెల్లువెత్తాయి. ముఖ్యంగా అంతర్జాతీయ నెంబర్లతో వచ్చే కాల్స్ మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇలాంటి స్పామ్ మేసేజ్‌లు, కాల్స్‌ను ఆసరాగా తీసుకుని సైబర్ మోసగాళ్లు కూడా రకరకాల స్కామ్‌లతో సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు. పెరుగుతున్న డిజిటల్ వినియోగానికి తగినట్టుగా ఈ స్పామ్ కాల్స్, మేసేజ్‌లు పట్టణాలకే పరిమితం కాలేదు, గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతి వాట్సాప్ యూజర్ ప్రతిరోజూ ఏదొక స్పామ్, ప్రమోషనల్ వాట్సాప్ మెసేజ్‌లను ఎదుర్కొంటున్నారు. ప్రముఖ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన తాజా సర్వేలో మరిన్ని వివరాలు బహిర్గతం అయ్యాయి. దాదాపు 96 శాతం వాట్సాప్ యూజర్లు ప్రతిరోజూ ఈ స్పామ్ మెసేజ్, కాల్స్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల కస్టమర్ల ప్రైవసీ, డేటా దుర్వినియోగం, స్పామ్‌ల తనిఖీలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వాట్సాప్‌లో ప్రతిరోజూ రకరకాల ప్రమోషనల్, స్పామ్ మెసేజ్‌లు వస్తున్నాయని యూజర్లు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా 324 జిల్లాల్లోని వాట్సాప్ యూజర్ల నుంచి లోకల్ సర్కిల్స్ వివరాలను సేకరించగా, కేవలం 4 శాతం మంది మాత్రమే తమకు అటువంటి మెసేజ్‌లు రావట్లేదన్నారు. సగం మందికి(54 శాతం) పైగా యూజర్లు రోజుకు మూడు సార్లు స్పామ్ మెసేజ్‌లు వస్తున్నాయని, 30 శాతం మంది 4-7 స్పామ్ మెసేజ్‌లను, 11 శాతం మంది 8, అంతకంటే ఎక్కువ మెసేజ్‌లు వస్తున్నాయని చెప్పారు. ఈ మెసేజ్‌లలో ఎక్కువగా బిజినెస్ అకౌంట్ల నుంచి వస్తున్నాయని, స్పామ్ మెసేజ్‌లు పంపేవారు వాట్సాప్ ప్లాట్‌ఫామ్‌కు డబ్బు చెల్లిస్తున్నారని యూజర్లు తెలిపారు. ప్రస్తుతం వస్తున్న స్పామ్‌లు మూడేళ్ల నాటితో పోలిస్తే గణనీయంగా పెరిగాయని లోకల్ సర్కిల్స్ నివేదిక అభిప్రాయపడింది. గత 36 నెలల్లో స్పామ్‌ల సమస్య మరింత తీవ్రమైందని డేటా చెబుతోంది. రోజుకు ఒకటి నుంచి మూడు స్పామ్ మెసేజ్‌లను ఎదుర్కొనే యూజర్ల సంఖ్య తగ్గినప్పటికీ, 4-7 మెసేజ్‌లు, 8 లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ మెసేజ్‌లను చూసే యూజర్ల సంఖ్య బాగా పెరిగింది. ప్రతిరోజూ 8 లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ మెసేజ్‌లు చూసే వారు 2023లో 11 శాతం ఉండగా, ఇప్పుడు 19 శాతానికి పెరిగారు.

### రూపాయికి ముడి చమురు సెగ!



అమెరికా ఒత్తిడితో రష్యాయేతర చమురు కొనుగోళ్లకు భారత్ మొగ్గు చూపడం ద్వారా రూపాయి మరింత బలహీనపడనుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. ఖరీదైన రష్యాయేతర ముడి చమురు కొనుగోలు కారణంగా 2026 నాటికి డాలర్‌తో రూపాయి విలువ 93కి పడిపోవచ్చని విశ్లేషించింది. గతేడాది కాలంలో డాలర్‌తో రూపాయి 5 శాతం పతనమై 92 మార్క్‌ను దాటిన విషయం తెలిసిందే. "గతేడాది డాలర్‌తో పోలిస్తే 5 శాతం క్షీణించిన రూపాయి ఇటీవల యుఎస్- ఇండియా వాణిజ్య ఒప్పందం వల్ల ప్రస్తుతం రూ.90.4 వద్ద నమోదవుతోంది. మేము గతంలో డాలర్‌తో రూపాయి విలువ 95కి చేరుతుందని అంచనా వేయగా.. ఇప్పుడు 2026 చివరి నాటికి రూపాయి మరింత నెమ్మదిగా క్షీణించి సుమారు 93 వద్ద ట్రేడ్ కావొచ్చని భావిస్తు న్నాము. మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు తరలిపోవడం, వాణిజ్య ఒప్పందం ప్రకారం ఖరీదైన రష్యాయేతర ముడి చమురు వైపు మళ్లడం ఈ క్షీణతకు కారణ మవుతాయి." అని ఫిచ్ తన నివేదికలో పేర్కొంది. అమెరికా వడ్డీ రేట్ల తగ్గింపు ఆసియా కరెన్సీలకు మద్దతునిస్తుందని.. అయితే దేశీయ స్థిరత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఫిచ్ తెలిపింది. 'బలహీనమైన యుఎస్ డాలర్ నేపథ్యం ఎంపిక చేసిన కరెన్సీలకు మద్దతు ఇస్తుంది.. కానీ లాభాలు అసమానంగా ఉంటాయి. బలమైన కరెంట్ ఖాతాలు, ఆర్థిక లోటు, వాణిజ్య క్షీణత లేదా జోక్యం ఎక్కువగా ఉండే దేశాల కరెన్సీలు తమ విలువను నిలబెట్టుకోవడంలో ఇబ్బంది పడతాయి." అని ఫిచ్ తెలిపింది.

### దేశీయంగా మొట్టమొదటి స్టోర్ ప్రారంభించిన నథింగ్ ఇండియా




ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, టెక్ గ్యాడ్జెట్‌లకు భారత మార్కెట్ అత్యంత అనువైన కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే భారత్ మార్కెట్లో రిటైల్ స్టోర్ల ఏర్పాటుతో ఎంట్రీ ఇచ్చిన యాపిల్ రికార్డు స్థాయిలో అమ్మకాలను సాధిస్తోంది. ఈ క్రమంలో మరో గ్లోబల్ కంపెనీ, బ్రిటీష్ బ్రాండ్ నథింగ్ దేశీయంగా తన మొట్టమొదటి ఫ్లాగ్‌షిప్ రిటైల్ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. బెంగళూరులో ఏర్పాటు చేసిన ఈ స్టోర్ ప్రారంభానికి నథింగ్ సీఈఓ కార్ల్ పీ, కో-ఫౌండర్, నథింగ్ ఇండియా ప్రెసిడెంట్ అకిల్ ఎవాంజెలిడిస్ హాజరయ్యారు. ఈ ఫ్లాగ్‌షిప్ స్టోర్ ద్వారా కంపెనీ భారత మార్కెట్లో తన బ్రాండ్ కింద ఉన్న స్మార్ట్‌ఫోన్, దుస్తులు సహా ఇతర ఉత్పత్తులను విక్రయించనుంది. దేశీయంగా కంపెనీ విస్తరణకు ఈ స్టోర్ కీలక మైలురాయిగా నిలుస్తుందని కంపెనీ అభిప్రాయపడింది. ఇప్పటికే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తమ బ్రాండ్‌కు స్థానిక కమ్యూనిటీ సంబంధాలు మరింత బలపడేందుకు ఈ స్టోర్ సహకారం అందిస్తుందని అభిప్రాయపడింది. బెంగళూరులోని ఇందిరానగర్‌లో ఉన్న ఈ స్టోర్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలు అందుబాటులో ఉంటుందని నథింగ్ ఇండియా స్పష్టం చేసింది. ఇప్పటివరకు నథింగ్ కంపెనీ లండన్‌లో మాత్రమే స్టోర్‌ను నిర్వహిస్తోంది. దీని తర్వాత భారత్‌లో మాత్రమే రెండో స్టోర్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ స్టోర్‌లో నథింగ్ స్మార్ట్‌ఫోన్‌లతో పాటు స్మార్ట్‌వాచ్‌లు, ట్రూ వైర్‌లెస్ ఇయర్‌బడ్స్, ఇతర స్మార్ట్ పరికరాలను కస్టమర్లు స్వయంగా సందర్శించి కొనుగోలు చేయవచ్చని కంపెనీ వెల్లడించింది.

# న్యూజిలాండ్‌కు కొత్త కెప్టెన్




న్యూజిలాండ్ మహిళల క్రికెట్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. స్టార్ ఆల్‌రౌండర్ అమేలియా కెర్ ఆ జట్టు నూతన ఆల్ ఫార్మాట్ కెప్టెన్‌గా నియమించబడింది. సోఫీ డివైన్ గతేడాది వన్డే ప్రపంచకప్ తర్వాత కెప్టెన్సీ నుంచి తప్పుకున్న నేపథ్యంలో కెర్ న్యూజిలాండ్ సారథిగా బాధ్యతలు చేపట్టింది. 25 ఏళ్ల కెర్ 2016లో 16 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. కుడి చేతి వాటం బ్యాటర్, లెగ్ స్పిన్నర్ అయిన కెర్.. ఇప్పటివరకు 84 వన్డేలు, 88 టీ20లు ఆడింది. వన్డేల్లో 4 సెంచరీలు, 10 హాఫ్ సెంచరీల సాయంతో 2304 పరుగులు చేసింది. ఇందులో ఓ డబుల్ సెంచరీ కూడా (232లి) ఉంది. అలాగే బౌలింగ్‌లో ఓ ఐదు వికెట్ల ప్రదర్శన సహా 106 వికెట్లు తీసింది. టీ20ల్లో 100కు పైగా స్ట్రయిక్‌రేట్‌తో, 5 హాఫ్ సెంచరీల సాయంతో 1453 పరుగులు చేసిన కెర్.. బౌలింగ్‌లో 2 నాలుగు వికెట్ల ప్రదర్శనల సాయంతో 95 వికెట్లు తీసింది. కెర్ 2024 టీ20 ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన చేసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ అవార్డు గెలుచుకుంది. అదే ఏడాది ఐసీసీ మహిళల ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు కూడా గెలుచుకొని, ఈ ఘనత సాధించిన తొలి న్యూజిలాండ్ ప్లేయర్ అయ్యింది. కెర్ న్యూజిలాండ్ ఆల్ ఫార్మాట్ కెప్టెన్‌గా ఎంపికైన తర్వాత భావోద్వేగానికి లోనైంది. న్యూజిలాండ్ తరఫున ఆడటం నా చిన్ననాటి కల. ఇప్పుడు కెప్టెన్‌గా అవకాశం రావడం గొప్ప గౌరవమని పేర్కొంది. ఈ జట్టులో ఉన్న ప్రతిభ, కృషి, అంకితభావం నన్ను ఉత్సాహపరుస్తున్నాయి. మనం కలిసి గొప్ప విజయాలు సాధించగలమని నమ్ముతున్నాను అంటూ కెర్ సోషల్‌మీడియాలో ఓ సందేశాన్ని పోస్ట్ చేసింది. కెర్ ఎంపికపై ఆ జట్టు హెడ్ కోచ్ బెన్ సాయర్ హర్షం వ్యక్తం చేశారు. కెర్ జట్టులో గౌరవం పొందిన నాయకురాలు. ఆమె నాయకత్వం న్యూజిలాండ్ మహిళల క్రికెట్ భవిష్యత్తుకు స్థిరత్వం, నిరంతరతను ఇస్తుందని అన్నారు. కెర్ తన కెప్టెన్సీ కెరీర్‌ను జింబాబ్వేతో జరిగే హోమ్ సిరీస్‌తో ప్రారంభించనుంది. ఫిబ్రవరి 25న సెడ్డన్ పార్క్‌లో జరిగే మొదటి టీ20 ఈ సిరీస్ మొదలవుతుంది.

కెర్ ముందున్న సవాళ్లు

- 2026లో ఇంగ్లండ్‌లో ı20 ప్రపంచకప్ నిలబెట్టుకోవడం.
- 2027లో శ్రీలంకలో ×జజ ı20 ఛాంపియన్స్ ట్రోఫీ.
- 2028లో లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్, ı20 ప్రపంచకప్.

## స్పోర్ట్స్

### సూపర్ 8లోకి ఇంగ్లండ్.. ఇటలీపై 24 రన్స్ తేడాతో గెలుపు




**కోల్‌కతా:** టీ20 వరల్డ్‌కప్‌లో ఇవాళ ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 24 రన్స్ తేడాతో నెగ్గింది. దీంతో ఆ జట్టు గ్రూపు సీ నుంచి సూపర్ 8లోకి వెళ్లింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 202 రన్స్ స్కోరు చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇటలీ 178 రన్స్ చేసి ఆలౌటైంది. ఇటలీ ప్లేయర్ బెన్ మానెంటి 25 బంతుల్లో 60 రన్స్ చేసి కాసేపు దడపుట్టించాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. జస్టిస్ మోస్కా 34 బంతుల్లో 43 రన్స్, గ్రాంట్ స్టీవార్ట్ 23 బంతుల్లో 45 రన్స్ చేశారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో విల్ జాక్స్ శరవేగంగా హాఫ్ సెంచరీ కొట్టాడు. కేవలం 22 బంతుల్లో అతను 53 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 4 సిక్సర్లు, మూడు ఫోర్లు ఉన్నాయి. ఇంగ్లండ్ బ్యాటర్లలో ఫిల్ సాల్ట్ 28, జాకబ్ బేతల్ 23, టామ్ బాంటన్ 30 రన్స్ స్కోరు చేశారు.

### భారత్ చేతిలో ఓడినా.. చరిత్ర సృష్టించిన పాక్




టీమిండియా చేతిలో ఓడినా పాకిస్తాన్ సరికొత్త చరిత్ర సృష్టించింది. టీ20 ప్రపంచకప్ టోర్నీలో రెండుసార్లు 18 ఓవర్లపాటు స్పిన్ బౌలింగ్‌నే ప్రయోగించిన తొలి జట్టుగా నిలిచింది. టీ20 వరల్డ్‌కప్-2026 టోర్నీలో భాగంగా కొలంబో వేదికగా పాకిస్తాన్ ఆదివారం టీమిండియాతో తలపడిన విషయం తెలిసిందే. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న పాక్.. తమ స్పిన్ దళంపైనే ఎక్కువగా ఆధారపడింది. స్పెషలిస్టు స్పిన్నర్లలో ఉస్మాన్ తారిఖ్ నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసి 24 రన్స్ ఇచ్చి ఒక వికెట్ తీయగా.. అబ్రార్ అహ్మద్ మూడు ఓవర్లు వేసి 38 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇక బ్యాటింగ్ ఆల్‌రౌండర్లు సల్మాన్ ఆఘా రెండు ఓవర్లు వేసి 10 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా.. నాలుగు ఓవర్ల కోటాలో సయీమ్ అయూబ్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. మరోవైపు షాదాబ్ ఖాన్ ఒక ఓవర్ వేసి 17 రన్స్, మొహమ్మద్ నవాజ్ 4 ఓవర్లలో 28 రన్స్ ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. ఇలా నిర్ణీత 20 ఓవర్లలో 18 ఓవర్లు పాక్ స్పిన్నర్లే వేయగా.. ఏకైక పేసర్ షాహిన్ అఫ్రిది రెండు ఓవర్లు వేసి ఏకంగా 31 పరుగులు సమర్పించుకుని ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. కాగా పాక్ ఇలా స్పిన్ దళాన్నే నమ్ముకోవడం ఇదే తొలిసారి కాదు. 2012 టీ20 వరల్డ్‌కప్ టోర్నీలో ఆస్ట్రేలియా మీద కూడా ఇదే తరహాలో ఇదే వేదికపై స్పిన్ అస్త్రాన్ని ప్రయోగించింది పాక్.

తద్వారా పొట్టి వరల్డ్‌కప్ ఈవెంట్లో అత్యధికంగా రెండుసార్లు 18 ఓవర్లు స్పిన్ వేయించిన తొలి జట్టు పాకిస్తాన్ నిలిచింది. కాగా కొలంబో పిచ్ స్పిన్‌కు అనుకూలం అన్న సంగతి తెలిసిందే. ఇక భారత్‌తో మ్యాచ్‌లో పాక్ 61 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో పాక్ ప్రధానంగా స్పిన్‌ను నమ్ముకుంటే.. టీమిండియా పేసర్లకు కూడా ప్రాధాన్యం ఇచ్చింది. భారత పేసర్లలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మూడు ఓవర్లు వేసి కేవలం 16 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా రెండు ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చాడు. ఇక స్పిన్నర్లలో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ నాలుగు ఓవర్లు వేసి రెండు వికెట్లు తీయగా.. వరుణ్ చక్రవర్తి మూడు ఓవర్లలోనే రెండు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ మూడు ఓవర్లు వేసి ఒక వికెట్ పడగొట్టగా.. పార్ట్‌టైమ్ స్పిన్నర్లు తిలక్ వర్మ రెండు ఓవర్లు వేసి ఒక వికెట్ తీయగా.. రింకూ సింగ్ ఒక ఓవర్లో 9 పరుగులు సమర్పించుకున్నాడు.



# 24 గంటలు కనిపించడం ఇష్టం లేదు

కొంతమంది సెలబ్రిటీలు ఎప్పుడూ వార్తల్లో ఉండాలనుకుంటారు. ఏదో ఒకరకంగా తమ గురించే మాట్లాడుకోవాలని, అందరి నోళ్లలో నానుతూ ఉండాలని తహతహలాడతారు.అలా పబ్లిసిటీ కోసం పీఆర్ టీమ్‌లను పెట్టుకుంటారు. కానీ తనకు అలాంటివేవీ ఇష్టం లేదని, పీఆర్ టీమ్ అసలే లేదని చెప్తోంది హీరోయిన్ శోభిత ధూళిపాళ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శోభిత మాట్లాడుతూ.. గతంలో నేను పీఆర్ ఏజెన్సీలతో పని చేశాను. కానీ, నా వ్యక్తిత్వానికి ఆ పద్ధతులు సెట్ అవవు అని అర్థమైంది. 24 గంటలు అందరికీ కనిపించాలి, అందరూ నాకోసం మాట్లాడుకోవాలి అని నేను అనుకోవడం లేదు. అది నాకు ఏమాత్రం ఉపయోగపడదు, దానిపై నాకు ఆసక్తి అసలే లేదు. నాకు పీఆర్ లేదు, కానీ కొందరికి అది బానే పని చేస్తుంది. నేను సినీ బ్యాక్‌గ్రౌండ్ నుంచి రాలేదు, నాది ముంబై కూడా కాదు. వైజాగ్ నుంచి వచ్చి ఇండస్ట్రీలో అడుగుపెట్టిన నేను ఒక్కొక్కటిగా నేర్చుకుంటూ ముందుకు సాగాను. నాకు ఏం కావాలి? ఏం వద్దనే విషయాలపై క్లారిటీ ఉంది. రూల్స్‌తో సంబంధం లేకుండా నా దారిలో వెళ్లడమే నాకిష్టం. జనాలకు ఏదిష్టం, వాళ్లేం కోరుకుంటున్నారు? అనేది నాకు తెలియదు. కానీ నా గురించి నాకు బాగా తెలుసు అని చెప్పుకొచ్చింది. శోభిత ధూళిపాళ తెలుగమ్మాయే అయినప్పటికీ బాలీవుడ్‌లో ఎక్కువ పాపులర్ అయింది. గూఢచారి, మేజర్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు సైతం దగ్గరైంది. ఇటీవలే చీకటిలో సినిమాతో మరోసారి అలరించింది



## ఆ వీడియో నా జీవితాన్నే మార్చేసింది

సినిమా ఇండస్ట్రీలోకి కొంతమంది కుటుంబ అంగీకారంతో వస్తే, మరి కొంతమంది మాత్రం సినిమాపై ప్యాషన్ ఉండి, కుటుంబం దానిని వ్యతిరేకించిన వారి నుండి దూరమై పరిశ్రమలోకి వస్తుంటారు.కుటుంబానికి ఇష్టం లేకపోయినా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి ప్రస్తుతం తనకంటూ ఒక గుర్తింపు ఏర్పరచుకున్న ముద్దుగుమ్మలలో ఇనయా సుల్తానా ఒకరు. ఈ బ్యూటీ తెలుగు బిగ్ బాస్ కార్యక్రమంలో పార్టిసిపేట్ చేసింది. దీని ద్వారా ఈ నటి బుల్లితెర ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. ఆ తర్వాత ఈమె పలు టీవీ షోలలో కూడా పార్టిసిపేట్ చేసింది. అలాగే కొన్ని సినిమాల్లో కూడా నటించింది. తాజాగా ఇనయా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఈ నటి తనకు ఒక వీడియో ద్వారా అనేక కష్టాలు ఎదురయ్యాయని, ఆఖరికి దానివల్ల కుటుంబం మొత్తానికే దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేసింది. తాజాగా ఇనయా సుల్తానా మాట్లాడుతూ... "నేను పుట్టినరోజు వేడుకల్లో రామ్ గోపాల్ వర్మ గారితో కలిసి డాన్స్ చేశాను. ఆ వీడియో అంతలా వైరల్ అవుతుందని నేను అనుకోలేదు. తీరా చూస్తే ఆ తర్వాత ఆ వీడియో చాలా వైరల్ గా మారింది. దాని ప్రభావం నాపై చాలా గట్టిగా పడింది. వీడియో వైరల్ అయిన తర్వాత నా కుటుంబం నన్ను దూరం పెట్టింది. ఆ తర్వాత నా కుటుంబం మాత్రమే కాకుండా నా బంధువులు కూడా నన్ను దూరం పెట్టడం మొదలుపెట్టారు" అని ఆమె చెప్పింది.

## ఇప్పటికి 2000 ఫోక్ సాంగ్స్ చేశాను

ఫోక్ సాంగ్స్ తో మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో జాను లిరి ఒకరు. ఈమె చాలా సంవత్సరాల నుండి ఫోక్ సాంగ్స్ లో నటిస్తూ వస్తుంది. ప్రైవేట్ సాంగ్స్ తో మంచి క్రేజ్ను సంపాదించుకున్న ఈమె ప్రస్తుతం వరుస పెట్టి ఫోక్ సాంగ్స్ చేయడమే కాకుండా టీవీ షోలలో కూడా పాల్గొంటుంది. టీవీ షోల ద్వారా ఈమె తన పాపులారిటీని మరింతగా పెంచుకుంది. అలాగే టెలివిజన్ షోల ద్వారా ఈమె బుల్లితెర అభిమానులను కూడా సంపాదించుకుంది.తాజాగా జాను ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఆమె తనకు సంబంధించిన కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను తెలియజేసింది. తాజాగా జాను మాట్లాడుతూ... నేను చాలా కాలం నుండి ప్రైవేట్ సాంగ్స్ చేస్తున్నాను. ఇప్పటివరకు నేను దాదాపు 2000 వరకు ఫోక్ సాంగ్స్ చేశాను. కొత్తగా కెరియర్ ప్రారంభించిన సమయంలో ఈవెంట్ కు వెళ్ళినట్లయితే ఒక్కో ఈవెంట్ కు 1000 లేదా 1500 రూపాయలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఒక్కో సాంగ్ కి 20,000 నుండి 50 వేల వరకు తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించింది. ఈ మధ్యకాలంలో అనేకమంది ఫోక్ డాన్సర్స్ సోషల్ మీడియా ద్వారా మంచి గుర్తింపును సంపాదించుకుంటున్నారు. చాలామందితో పోలిస్తే జాను ఫోక్ డాన్సర్ల విషయంలో చాలా ముందు వరుసలో ఉంది. ఈమె సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్గా ఉంటూ వస్తుంది. సోషల్ మీడియాలో కూడా జానుకి చాలామంది ఫాలోవర్స్ ఉన్నారు.





# కోట్లు ఖర్చుపెట్టినా నాకు ఇంత పబ్లిసిటీ వచ్చేది కాదు

టాలీవుడ్ 'సీతమ్మ'గా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మృణాల్ ఠాకూర్ పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. తనపై వస్తున్న పెళ్లి పుకార్లకు మృణాల్ ఇచ్చిన అదిరిపోయే కౌంటర్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. సాధారణంగా సెలబ్రిటీలపై పుకార్లు వస్తే వారు అసహనం వ్యక్తం చేస్తారు, కానీ మృణాల్ ఠాకూర్ మాత్రం చాలా వెరైటీగా స్పందించి అందరినీ ఆశ్చర్యపరిచింది. గత కొన్ని రోజులుగా కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌తో మృణాల్ ప్రేమలో ఉందని, త్వరలోనే వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని సోషల్ మీడియాలో వార్తలు జోరుగా ప్రచారమవుతున్నాయి. ఈ పుకార్లపై మృణాల్ ఇప్పటికే స్పందించినప్పటికీ పుకార్లకు చెక్ పడటం లేదు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ మరోసారి తన వ్యక్తిగత జీవితంపై పుకార్లు సృష్టిస్తూ ట్రోల్ చేస్తున్న వారికి అదిరిపోయే కౌంటర్ ఇచ్చింది. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ప్రచారాల గురించి మృణాల్ మాట్లాడుతూ.. 'నా గురించి జరుగుతున్న ఈ ప్రచారం చూసి నేను అస్సలు విసుగు పడటం లేదు. నిజానికి నేను కోట్లు ఖర్చు పెట్టి ఒక పీఆర్ టీమ్‌ను పెట్టుకున్నా నాకు ఇంత పబ్లిసిటీ వచ్చేది కాదు. అందుకే నా గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రాస్తున్న వారందరికీ పెద్ద థ్యాంక్స్ చెబుతున్నాను" అని సెటైరికల్‌గా సమాధానమిచ్చింది. పుకార్లు సృష్టించే వారికే రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినట్లుగా ఆమె చేసిన వ్యాఖ్యలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. పెళ్లి గురించి ఇంట్లో ఒత్తిడి ఉందా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. "మా కుటుంబ సభ్యులు కూడా నన్ను నిత్యం పెళ్లి చేసుకోమని, లైఫ్‌లో సెటిల్ అవ్వమని అడుగుతుంటారు. కానీ ఒక నటిగా కెరీర్‌ను బ్యాలెన్స్ చేయడం ఎంత కష్టమో వారికి తెలుసు. ముఖ్యంగా సౌత్ సినిమాలతో పాటు హిందీ సినిమాల్లో నటించడం మామూలు విషయం కాదు.



## విశ్వక్ సేన్‌కి దెబ్బ మీద దెబ్బ.. అసలేమైంది?

గత కొన్నేళ్లుగా చూసుకుంటే తెలుగు మిడ్ రేంజ్ హీరోలకు ఎప్పటికప్పుడు డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ప్రేక్షకుల పల్స్ వీళ్లు అర్థం చేసుకోలేకపోతున్నారా? సరైన స్టోరీలని ఎంపిక చేసుకోలేకపోతున్నారా? తెలియట్లేదు గానీ చేసిన సినిమాలు చేసినట్లు బాక్సాఫీస్ దగ్గర ఫెయిలవుతున్నాయి. ఒకవేళ సక్సెస్ అయినా సరే కలెక్షన్స్ పెద్దగా రావడం లేదు. దీనికి లేటెస్ట్ ఉదాహరణ విశ్వక్ సేన్. వరసపెట్టి మూడు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఇంతకీ తప్పు ఎక్కడ జరుగుతోంది? 'ఈ నగరానికి ఏమైంది?', 'ఫలక్‌నుమా దాస్', 'హిట్' లాంటి సినిమాలతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న విశ్వక్ సేన్.. తర్వాత చేసిన 'అశోకవనంలో అర్జున కల్యాణం'తో నటుడిగా ఆకట్టుకున్నాడు. కానీ గత రెండు మూడేళ్లుగా చూసుకుంటే కెరీర్ ఏ మాత్రం ఆశజనకంగా లేదు. 2024లో ఏకంగా మూడు చిత్రాలతో వస్తే.. వాటిలో 'గామి' ప్రయోగాత్మక చిత్రం కావడంతో జనాలకు సరిగా రీచ్ కాలేదు. 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ఓ మాదిరి రెస్పాన్స్ అందుకుంటే.. 'మెకానిక్ రాకీ' ఘోరంగా దెబ్బతింది. గతేడాది ఇదే టైంకి వచ్చిన 'లైలా' అయితే అల్ట్రా డిజాస్టర్. దీంతో ఏడాది గ్యాప్ తీసుకుని 'జాతిరత్నాలు' దర్శకుడు అనుదీప్‌తో కలిసి 'ఫంకీ' చేశాడు. ఇదీ ఇప్పుడు బాక్సాఫీస్ దగ్గర ఫెయిలైంది. ఒకప్పటితో పోలిస్తే విశ్వక్ సేన్ యాటిట్యూడ్ ఎలా తగ్గిపోయిందో.. బాక్సాఫీస్ దగ్గర అతడి సినిమాలకు ఓపెనింగ్ కలెక్షన్స్ కూడా అలానే తగ్గిపోతూ వస్తున్నాయి. ఓ రకంగా చూస్తే ఇది డేంజర్ బెల్స్ అని చెప్పొచ్చు. ప్రస్తుతం ఇతడి చేతిలో 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్, దర్శకుడిగా చేస్తున్న 'కల్ట్' ఉన్నాయి. ఈ రెండింటితోనైనా విశ్వక్.. బలమైన కంబ్యాక్ ఇవ్వాల్సి ఉంటుంది. లేదంటే మాత్రం రేసులో వెనకబడిపోవడం గ్యారంటీ. విశ్వక్ సేన్ మాత్రమే కాదు టాలీవుడ్‌లో చాలామంది మిడ్ రేంజ్ హీరోల కెరీర్ దాదాపు ఇలానే ఉంది. గోపీచంద్, రవితేజ లాంటి హీరోల మార్కెట్ ఇప్పటికే చాలా పడిపోయింది. వీళ్లు సినిమాలైతే చేస్తున్నారు గానీ అటు కంటెంట్ పరంగా ఇటు మార్కెట్ పరంగా రెండూ వర్కౌట్ కావట్లేదు. వసూళ్లు కూడా పెద్దగా రావట్లేదు. సాయిధరమ్ తేజ్, సుధీర్ బాబు, శర్వానంద్, అల్లరి నరేశ్, నితిన్, వరుణ్ తేజ్, రామ్ పోతినేని లాంటి హీరోల పరిస్థితీ దాదాపు ఇంతే. పైన చెప్పిన హీరోలు.. తాము అసలు ఎలాంటి సినిమాలు చేస్తే ప్రేక్షకులు చూస్తారో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. అప్పుడో ఇప్పుడో అన్నట్లు వస్తున్నారు. కానీ సక్సెస్ అందుకోలేకపోతున్నారు. వీళ్లు కాకుండా ఉన్న మిగతా మిడ్, చిన్న రేంజ్ హీరోల పరిస్థితి అయితే అంతకంటే దారుణంగా ఉంది. ఇవన్నీ చూస్తుంటే రాబోయే రోజుల్లో పరిస్థితి ఇంకెంత ఘోరంగా ఉండబోతుందో ఏంటో అనిపిస్తోంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com